సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 10.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 279
పేజీలు: 08 వెల: రూ. 5

## నేటితో ఆఖరు సర్
### తెలంగాణలో 70 లక్షల ఓట్లు గాయబ్
02

- ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు
- గ్రేటర్ హైదరాబాద్ లో 40 లక్షల మంది ఓటర్లు సర్వేకు దూరం
- సర్ ప్రక్రియ ముగిసేందుకు నేడే ఆఖరి రోజు
- ఓటు హక్కు నమోదుకాని వారు సంప్రదించండి




## పాతబస్తీ హిందువులదే
### భాగ్యలక్ష్మీ ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం

- రంజాన్ పండుగకు రూ.33 కోట్లు
- 80 శాతం ఉన్న హిందువుల పండుగలకు రూ.20 కోట్లా?
- కేంద్ర మంత్రి బండి

03



## కేసీఆర్ సీఎంగా ఉంటే ఏపీ ధైర్యం చేసేదా?
### జీఆర్ఎంబీ అజెండాపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం

- తెలంగాణ నీళ్లపై ఏపీ కుట్ర
- రేవంత్ మౌనంపై హరీష్ రావు ప్రశ్నలు
- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులపై వివాదం

03



## నా అల్లుడు 25 మందిని పెళ్లి చేసుకున్నాడు
### బీజేపీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు

- ఫేక్ ఐడీలతో పలువురు మహిళలను మోసం చేశాడని ఆరోపణ
- 2024లో ఎమ్మెల్యే కుమార్తెతో ప్రఖార్ త్రివేది వివాహం
- అల్లుడిపై పోలీసులకు ఫిర్యాదు

03



# కాంగ్రెస్‌లో కొత్త ఫార్ములా
## నాలుగు వర్గాలకు నాలుగు కీలక పదవులు
## టీపీసీసీలో సామాజిక సమీకరణం

- నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు!
- టీపీసీసీ బలోపేతానికి కొత్త ప్లాన్..
- వర్కింగ్ ప్రెసిడెంట్లపై కసరత్తు!
- సామాజిక సమతుల్యతే టార్గెట్..
- జగ్గారెడ్డికి ప్రచార కమిటీ పగ్గాలు?
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ.. కాంగ్రెస్‌లో కొత్త సమీకరణం!
- ఎన్నికలే టార్గెట్ గా తెలంగాణ కాంగ్రెస్‌లో భారీ సంస్థాగత మార్పులు!

**ముద్ర, డెస్క్ :**
తెలంగాణ కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పుల పై చర్చ మళ్లీ ఊపందుకుంది. టీపీసీసీని మరింత బలోపేతం చేయడంతో పాటు.. పార్టీలో సామాజిక, ప్రాంతీయ సమతుల్యతను పాటించేలా కొత్త నాయకత్వ నిర్మాణానికి కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించే ప్రతిపాదన తెర పైకి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**ఒక్కరి చేతుల్లో కాకుండా..**
ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ కొనసాగుతున్నారు. ఆయన బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో.. మిగిలిన ప్రధాన సామాజిక వర్గాలకు కూడా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంలో ప్రాధాన్యం కల్పించాలనే ఆలోచనతో అధిష్ఠానం ముందుకు వెళ్తున్నట్లు సమాచారం. పార్టీకి వివిధ వర్గాల్లో మరింత బలమైన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు.. ఆయా సామాజిక వర్గాల నాయకులను సమన్వయం చేసుకునేందుకు ఈ ఫార్ములాను అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకే పీసీసీ అధ్యక్షుడిపై సంస్థాగత బాధ్యతలన్నీ కేంద్రీకృతం కాకుండా.. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లకు బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలనే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని యాక్టివ్‌గా ఉంచేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

**నాలుగు సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం**
వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని పేర్లను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.




అయితే వీరిలో తుది ఎంపిక ఎవరికి దక్కుతుందనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ పేర్లను జాతీయ నాయకత్వం పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు పార్టీ వరాలు చెబుతున్నాయి. దీంతో ప్రస్తుతం టీపీసీసీలో మిగతా 02లో

- నేతల మధ్య విభేదాలకు చెక్ పెట్టే యత్నం
- బీసీ సామాజిక సమీకరణాలపై దృష్టి..
- దూకుడైన నాయకత్వం కోసం కసరత్తు
- రాష్ట్ర అధ్యక్షుడిగా పేరు తెరపైకి..
- దసరాకు క్లారిటీ వచ్చే అవకాశం?



# మళ్లీ బండికే పగ్గాలు!
### తెలంగాణ బీజేపీకి కొత్త సారథి?
### తెలంగాణపై బీజేపీ హైకమాండ్ ఫోకస్..

**ముద్ర డెస్క్ :**
తెలంగాణలో వచ్చే ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ అధిష్టానం.. రాష్ట్ర పార్టీలో కీలక మార్పులపై దృష్టి సారించినట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్ష బాధ్యతలను మరోసారి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు అప్పగించే అంశం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ దూకుడైన నాయకత్వంతో పార్టీని గ్రామస్థాయికి తీసుకెళ్లారని బీజేపీలోని ఓ వర్గం అభిప్రాయపడుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికలు, దుబ్బాక, హుజురాబాద్ ఉపఎన్నికల్లో పార్టీ విజయాలు, మునుగోడులో గట్టి పోటీ వంటి అంశాలను ఆయన నాయకత్వానికి అనుకూలంగా ప్రస్తావిస్తున్నారు. బీసీ సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ వ్యూహంలోనూ సంజయ్ పేరు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. మిగతా 02లో

## మమత కారుపై దాడి
### కారుపై చెప్పులు, రాళ్లు
02

- దీదీ వాహనాన్ని చుట్టుముట్టిన నిరసనకారులు
- మమతా బెనర్జీకి చేదు అనుభవం
- కారుపై బురద.. రాళ్ల దాడి!
- బెంగాల్‌లో మమతాకు నిరసన



## లాల్ దర్వాజాలో బోనాల జాతర
### సింహవాహిని సేవలో భక్తజనం!



- దర్శనానికి పోటెత్తిన భక్తులు!
- బంగారు బోనంతో నైవేద్యం
- మహంకాళి ఆలయం కిటకిట
- ప్రత్యేక పూజల్లో ప్రముఖులు!
- డప్పుచప్పుళ్లు.. బోనాల ఊరేగింపులు
- హైదరాబాద్ లో పండుగ శోభ!

02

## వైద్యవిద్యార్థిని ప్రియాంక మృతి
### కిమ్స్‌లో చికిత్స పొందుతూ ప్రియాంక తుదిశ్వాస



- ధ్రువీకరించిన కిమ్స్ వైద్యులు
- ప్రియాంకను కబళించిన తాగుబోతుల కారు యాక్సిడెంట్
- కన్నీటితో కుటుంబం..
- నిందితులను వదలొద్దంటున్న ప్రియాంక తండ్రి

02

## ఆదివాసీలతో అద్భుతాలు
02
### గిరిజన బిడ్డలు ఐఐటీలకు వెళ్లాలి

- అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం
- గిరిజనుల హక్కుల కోసం పోరాడతాం
- గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు వారికే దక్కాలి
- సీఎం చంద్రబాబు



## అండగా ఉంటాం
### నల్లబెల్లి పర్యటనలో కేసీఆర్‌కు ఘన స్వాగతం
02

- పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ
- వందలాది వాహనాల్లో వచ్చిన గులాబీ సైన్యం
- దారిపొడవునా అభిమానుల అభివాదం
- పూలు చల్లుతూ అభిమానం చాటుకున్న ప్రజలు






## జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం
03

- అక్టోబర్ 2న జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే
- జర్నలిస్టులపై దాడులకు అడ్డుకట్ట వేయాలి

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం, 10.08.2026
www.mudranews.in | @mudranews



### తాగునీటి నాణ్యతకుpH టెస్ట్ చేయండి



pH మీటర్ లేదా టెస్ట్ స్ట్రిప్స్‌తో నీటి ఆమ్లత్వం, క్షారత్వాన్ని పరీక్షించవచ్చు. తాగునీటి pH సాధారణంగా సుమారు 6.5—8.5 మధ్య ఉండటం మంచిది.

# కాంగ్రెస్‌లో కొత్త ఫార్ములా

(మొదటి పేజీ తరువాయి)
కొనసాగుతున్న నాయకత్వ సమీకరణాల్లో ఈ నిర్ణయం ఎలాంటి మార్పులు తీసుకురాబోతుందనే ఆసక్తి నెలకొంది.

**జగ్గారెడ్డికి కీలక బాధ్యత?**
వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకంతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్ పదవిపైనా కాంగ్రెస్‌లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. పార్టీ ప్రచారాన్ని సమన్వయం చేయ



డం.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలకు రాజకీయంగా సమాధానం ఇవ్వడం వంటి అంశాల్లో ప్రచార కమిటీ కీలక పాత్ర పోషించనుంది. జగ్గారెడ్డికి ఈ బాధ్యత అప్పగిస్తే.. పార్టీ ప్రచార వ్యవస్థకు ఒక స్పష్టమైన నాయకత్వం లభించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

**సామాజిక సమీకరణమే అసలు వ్యూహమా?**
తెలంగాణ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు ఎప్పటికప్పుడు కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీకి విస్తృతమైన సామాజిక మద్దతు సమీకరించుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ల ఫార్ములా కేవలం పదవుల పంపిణీకే పరిమితమైతే ఆశించిన ఫలితం రాకపోవచ్చు. ఎవరికెంత బాధ్యత? ఏ ప్రాంతంపై ఎవరి పట్టు? పార్టీ నిర్ణయాల్లో వారి పాత్ర ఎంత? అనే అంశాలపై స్పష్టత అవసరం. లేదంటే బహుళ నాయకత్వం పార్టీకి బలంగా మారాల్సింది పోయి.. అంతర్గత పోటీకి కారణమయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. మొత్తంగా చూస్తే.. టీపీసీసీలో ప్రతిపాదిత మార్పులు కేవలం కొత్త పదవుల భర్తీగా చూడలేం. తెలంగాణలో కాంగ్రెస్ తన సామాజిక పునాదిని మరింత విస్తరించుకోవడంతో పాటు.. పార్టీని ఎన్నికలకు మరింత సన్నద్ధం చేసే వ్యూహంలో భాగంగానే ఈ కసరత్తు జరుగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి అధిష్ఠానం తుది నిర్ణయంపైనే ఉంది. ఎవరికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కుతుంది? ప్రచార కమిటీ పగ్గాలు జగ్గారెడ్డికే వస్తాయా? అన్నది త్వరలోనే తేలనుంది.

# మళ్లీ బండికే పగ్గాలు!

(మొదటి పేజీ తరువాయి)
అయితే ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పదవీకాలం కొనసాగుతున్న నేపథ్యంలో తక్షణమే మార్పు ఉండకపోవచ్చని మరో వాదన వినిపిస్తోంది. ముందుగా నేతలను క్షేత్రస్థాయిలో పనిచేయించి.. పరిస్థితిని సమీక్షించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దసరా నాటికి ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నది అంతర్గత చర్చ. ఇదిలా ఉండగా.. బండి సంజయ్‌కు సంబంధించిన వ్యక్తిగత వివాదాలు, కేసుల అంశం కూడా రాష్ట్ర అధ్యక్ష పదవికి అడ్డంకిగా మారుతుందా? అన్న చర్చ సాగుతోంది. మొత్తంగా తెలంగాణ బీజేపీలో నాయకత్వ మార్పు అంశం హాట్‌టాపిక్‌గా మారింది. హైకమాండ్ చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.



# మమతా బెనర్జీ కారుపై దాడి



**ముద్ర, కోల్ కతా న్యూస్:**
పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓటీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా.. దీదీ కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. బిర్జు అనే టీఎంసీ కార్యకర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే ఆయన మృతి చెందారు. తన భర్తను లాకప్‌లో కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జు కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, డోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం కాస్త అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.




# నేటితో ఆఖరు సర్

**ముద్ర, హైదరాబాద్ :**
రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్..సర్) గడువు మరో రెండు రోజులే మిగిలింది. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఆగస్టు 10(సోమవారం) వరకు గడువు ఉంది. సర్ ప్రక్రియ జిల్లాల్లో మెరుగ్గా కనిపిస్తుండగా, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. రాష్ట్రంలో మొత్తం 3,38, 26,448 మంది ఓటర్లు ఉండగా, శనివారం సాయంత్రం వరకు 2,64,11,118 (78.08 శాతం) మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. చాలా జిల్లాలో 85 శాతానికి పైగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి కాగా, హైదరాబాద్‌లో 58.41 శాతం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 63.79 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.82 శాతం పూర్తయ్యింది. సర్ గడువు మరో రెండు రోజులే ఉండటంలో నిర్దేశిత సమయంలోగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవుతుందా.. లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, మొత్తం ఓటర్లలో 50 లక్షల నుంచి కోటి వరకు ఓట్లు తగ్గే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఉన్న డబుల్ ఓట్లను తొలగించడం, మరణించిన వారిని ఓట్లు తొలగించడం లో ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినప్పటికీ అర్హులైన వారి ఓట్లు తొలగిస్తారనే అంశంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో సర్ ప్రక్రియలో భాగంగా 20 లక్షల నుంచి 30 లక్షల వరకు అర్హులైన ఓట్లు తొలగిస్తారని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సర్ ప్రక్రియలో ప్రతి ఓటరు ఓటు తమ ఓటును కాపాడుకోవాలం టే ఎన్యూమరేషన్ ఫారం అత్యం త కీలకం. ఓటరు జాబితాలో ఉన్న చిరుమానా ఆధారంగానే బిఎల్‌ఓలకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపి ణీ చేశారు. అయితే, ఇళ్లు మారిన వాళ్లు, వలస కార్మికులు, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులు వారు తమ ఓటును బదిలీ చేసుకోకపోతే పాత చిరుమానాలో వారికి ఓటు ఉంటుంది. ప్రస్తుతం ఉంటున్న చిరుమానాలో వారికి ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వరు. పాత చి రునామాలో వారు అందుబాటులో లేకపోతే బీఎల్‌ఓలు షిఫ్ట్ అని రాస్తున్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఇవ్వలేరు కాబట్టి, ము సాయిదా జాబితాలో వారి పేరు ఉండదు. అలాంటి వారు తర్వాత కొత్త ఓటరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఈనెల 25 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 10 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ఉంది. పలు రాజకీయ పార్టీలు, సంఘాల విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగించింది. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17వ తేదీన ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేసి, ఆ రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబర్ 15 వరకు అభ్యంతరాను పరిశీలిస్తారు. అక్టోబర్ 19వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు.

# వైద్యవిద్యార్థిని ప్రియాంక మృతి



**ముద్ర, అమరావతి:**
రాజమహేంద్రవరం ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతిచెందారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్లు వెల్లడించారు. కర్నూలుకు చెందిన ప్రియాంక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 3న రాజమండ్రిలో తోటి విద్యార్థినితో కలిసి సినిమా థియేటర్ నుంచి వస్తుండగా మద్యం మత్తులో ఉన్న దుష్యంత్, ఆండ్రూ విలియం జోసెఫ్‌లు కారును వేగంగా నడుపుతూ వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. మరోసారి బలంగా ఢీకొట్టి ప్రియాంక మీద నుంచి కారు వెళ్లడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, గ్లాస్గో కోమా స్కేల్ (జీసీఎస్) తక్కువగా ఉండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు.

**వారిని వదిలిపెట్టరాదు**
కొద్ది రోజుల్లో వైద్య విద్య పూర్తి చేసుకుని వైద్యురాలిగా సేవలు అందిస్తుందని అనుకున్నామని తండ్రి వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకోవాలని అనుకునేది. కానీ ఆమెను ఈ పరిస్థితుల్లో చూడాల్సి వస్తుందనుకోలేదు. మా కుమార్తె బతకాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం, ఆప్నియా టెస్టుకు ఆమె శరీరం సహకరించడం లేదు అందుకే వైద్యులు విరమించుకున్నారు. మా కుమార్తెకు ఈ గతి పట్టించిన వాళ్లను వదలిపెట్టకూడదు. నడిరోడ్డులో ఉరితీయాలి.

# ఆదివాసీలతో అద్భుతాలు

**ముద్ర, అమరావతి:**
అవకాశాలు కల్పిస్తే.. అద్భుతాలు చేయగల సామర్థ్యం ఆదివాసీలకు ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. గిరిజన బిడ్డలు బాగా చదువుకొని ఐఐటీలకు వెళ్లాలని.. తద్వారా దేశానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. కొమ్ము, బంజారా, థింసా నృత్యాలతో గిరిజనులు ఆయనకు స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా చంద్రబాబు డప్పు కొట్టి.. బాలికలతో కాసేపు నృత్యం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు సమక్షంలో వివిధ ప్రైవేటు సంస్థలతో గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. ''దేశం మనకు ఏమిచ్చిందనేది కాకుండా.. దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన రావాలి. అరకు కాఫీని ప్రోత్సహించి ప్రపంచస్థాయికి తీసుకెళ్తున్నాం. పార్లమెంట్‌లోనూ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించాం. దీన్ని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం. అరకు కాఫీ బాగుందని ప్రధాని మోదీ కితాబిచ్చారు. మన్‌కీ బాత్ లోనూ దీని గురించి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ గిరిజనులకు న్యాయం చేసిన తొలిపార్టీ తెదేపా. గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకే ఉద్యోగాలు దక్కాలని జీవో నంబర్ 3 తీసుకొచ్చాం. 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన ఈ జీవో సుమారు 20 ఏళ్లు అమల్లో ఉంది. వైకాపా హయాంలో 2020లో సుప్రీంకోర్టు దీన్ని కొట్టివేసింది. జీవో నెం. 3ను కొట్టివేస్తే వైకాపా ప్రభుత్వం సరిగా డిఫెండ్ చేయలేకపోయింది. గిరిజనులకు లబ్ధి చేకూరేలా మళ్లీ అందరికీ ఆమోదయోగ్యమైన విధానం తీసుకొస్తాం. మా ప్రభుత్వం గిరిజనుల హక్కుల కోసం పోరాడుతుంది. గిరిజన బిడ్డలు ఆవేశానికి లోనవకుండా ఆలోచన చేయాలి' అని చంద్రబాబు అన్నారు.





# లాల్ దర్వాజాలో బోనాల జాతర

**ముద్ర, హైదరాబాద్ :**
లాల్ దర్వాజా బోనాల పండుగ అంబరాన్నంటింది. ప్రకృతిని, మాతృమూర్తిని దైవంగా భావించి పూజించే అత్యంత ప్రాచీనమైన ఈ ఘన సంప్రదాయం, భాగ్యనగరంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల కష్టాలను తీర్చే గ్రామదేవతగా, విష జ్వరాలు, రోగాల నుంచి రక్షించే చల్లని తల్లిగా పూజలందుకుంటున్న లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయం భక్తజనసందోహంతో కిటకిటలాడింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన మహంకాళి క్షేత్రం, ఘటాల ఊరేగింపులు, డప్పుచప్పుళ్లతో పాతబస్తీ వీధులన్నీ పులకించిపోయాయి.
అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పణ ఉదయం నుంచే వేలాదిమంది మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో తలపై వేపమండలతో అలంకరించిన బోనాల కుండలను ఎత్తుకుని కాళికాదేవికి నైవేద్యం అర్పించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించగా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల.. బంగారు బోనాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఒడిబియ్యం, చీర–సారెలతో అమ్మవారిని ఆరాధించారు. అలాగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి శాంతి కళ్యాణోత్సవం కంటికి ఇంపుగా సాగింది.

**ఒకే వేదికపైకి రాజకీయ, సినీ ప్రముఖులు**
సింహవాహిని అమ్మవారిని దర్శించుకోవడానికి పలువురు రాజకీయ, సినీ రంగానికి చెందిన ప్రముఖులు పోటీపడ్డారు. మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ యాదవ్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌లతో పాటు టాలీవుడ్ కథానాయకుడు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, ప్రముఖ గాయని మంగ్లీ తదితరులు అమ్మవారి పాదాల చెంత ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు వారికి అమ్మవారి శేషవస్త్రాలు కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు.

**పటిష్ఠ భద్రత.. క్యూలైన్లలో భక్తులకు వసతులు**
సుమారు ఐదు లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారనే అంచనాతో అధికారులు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. బోనాలతో వచ్చే మహిళల కోసం ప్రత్యేక మార్గంతో పాటు మొత్తం 6 క్యూలైన్‌లను అందుబాటులోకి తెచ్చారు. లాల్ దర్వాజా పరిసరాల్లోని వేలాది చిన్న ఆలయాల్లోనూ బోనాల సందడి నెలకొంది. ఎలాంటి అసౌకర్యం కలగకుండా 2,500 మంది పోలీసులతో బందోబస్తు, 100 సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, మెడికల్ క్యాంపులు, తాగునీటి సదుపాయాలు కల్పించారు. సోమవారం జరగబోయే రంగం –భవిష్యవాణి, పోతురాజుల విన్యాసాలు, అంబారీపై అమ్మవారి భవానీ రథయాత్రతో ఈ వేడుకలు ముగియనున్నాయి.



# అండగా ఉంటాం..

**ముద్ర, వరంగల్ న్యూస్:**
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేసీఆర్ రాక నేపథ్యంలో నల్లబెల్లికి భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద కార్యకర్తలు కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు రంగంలోకి దిగి కేసీఆర్ కాన్వాయ్‌ను సుదర్శన్‌రెడ్డి నివాసం లోపలికి తీసుకెళ్లారు.
పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయించిన విషయం తెలి సిందే. పార్టీ తరఫున ఇప్పటికే రూ. 2.25కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున అందించనున్నారు. ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ ప్రకటించింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 10.08.2026
www.mudranews.in | @mudranews



**తాగునీటి నాణ్యతకు రంగు, వాసన గమనించండి**

నీటిలో అసహజమైన రంగు, దుర్వాసన, మట్టి లేదా తేలియాడే కణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. అలాంటి నీటిని నేరుగా తాగకుండా పరీక్ష చేయించు కోవడం మంచిది.



# జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం

- అక్టోబర్ 2న జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే
- మీడియా రక్షణకు సమగ్ర చట్టం కావాలి
- జర్నలిస్టులపై దాడులకు అడ్డుకట్ట వేయాలి
- కేంద్రం ప్రత్యేక చట్టం తేవాలి: ఐజేయూ







**ముద్ర న్యూస్, బెంగళూరు :** జర్నలిస్టుల భద్రతకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని చేయాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. బెంగళూరులో రెండురోజులపాటు జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం సాయంత్రం ముగిసింది. సమావేశానికి ఐ.జే.యు. జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ అధ్యక్షత వహించారు.ఇటీవల కాలంలో జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు, చట్టపరమైన దాడులు, హింస, పెరిగిపోవడం, వార్తావనరుల గోప్యతకు అవసరమైన చట్టాలు లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో భారతదేశంలో జర్నలిస్టుల, మీడియా సంస్థల భద్రతకు ఒక ప్రత్యేక బలమైన చట్టం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఆమోదించిన ఒక తీర్మానంలో డిమాండ్ చేసింది.

ఐ.జే.యు. పూర్వాధ్యక్షుడు , తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ దేశంలో పత్రికా స్వేచ్ఛ నానాటికీ దిగజారి పోవడంపై ఆందోళన వ్యక్తం చేసారు. భారత రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛకు గట్టి హామీ ఇచ్చినప్పటికీ వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం లేకపోవడం వల్లనే బెదిరింపులు, దాడులు పెరిగిపోతున్నాయని, కొన్ని రాష్ట్రాల్లో జర్నలిస్టుల భద్రతకు ఇప్పటికే ప్రత్యేక చట్టాలు వచ్చినప్పటికీ , అవి అవసరానికి తగినవిధంగా లేవని ఆ తీర్మానం పేర్కొన్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమాచార పౌర సంబంధాల బడ్జెట్ ను, వివిధ శాఖలు జారీచేసే ప్రకటనలను అనుకూల ప్రచారం కోసం ఆయుధాలుగా వినియోగించడాన్ని ఆ తీర్మానం ఖండించింది.

1955, 1958 సంవత్సరాల నాటి రెండు వర్కింగు జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేసిన నేపథ్యంలో వర్కింగు జర్నలిస్టులకు వృత్తి భద్రత, వేతనభద్రత , మెరుగైన పనిపరిస్థితులు కల్పించేందుకు వీలుగా ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఐ.జే.యు. మరో తీర్మానంలో డిమాండ్ చేసింది. వివిధ మీడియా సంస్థలలో కొనసాగుతున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయో పరిమితిని 58 నుండి 60 సంవత్సరాలకు పెంచాలని ఐ.జే.యు. సమావేశం ఆమోదించిన మరో తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.ఐ.జే.యు. సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ , దేశంలో మీడియా స్థితిగతులపై, గత నాలుగు నెలల్లో యూనియన్ నిర్వహించిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై పదిహేను రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, దాదాపు ఇరవై మందికి పైగా జాతీయ కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు.

ఐ.జే.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్. ఎన్.సిన్హా, దేవులపల్లి అమర్, ఎం.ఎ. మాజిద్ , జాతీయ ఉపాధ్యక్షులు అమర్ మోహన్ ప్రసాద్, వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యదర్శులు డి.ఎస్.ఆర్. సుభాష్, పి.భాస్కర్ రెడ్డి, నరేంద్ర భరద్వాజ్, కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.జానకీ మోహన్, ప్రధాన కార్యదర్శి అంజన్ కుమార్ తదితరులు మాట్లాడారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 వ తేదీన "జర్నలిస్ట్ డిమాండ్స్ డే" ను దేశవ్యాప్తంగా పాటించాలని ఐ.జే.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది.

నవంబర్ 16 వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వీర్యమైపోయిన ప్రస్తుత పరిస్థితులపై దేశవ్యాప్త చర్చను లేవనెత్తాలని, సమస్యపై అవగాహన పెంచేందుకు ప్రచారాందోళనా కార్యక్రమాన్ని చేపట్టాలని, జర్నలిస్టులను, పౌర సమాజ ప్రముఖులను, ప్రజాప్రతినిధులను, న్యాయ నిపుణులను, విద్యావేత్తలను భాగస్వాములను చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు జరపాలని ఐ.జే.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది.అక్టోబర్ ఆఖరు వారంలో మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సును హైదరాబాద్ లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపులో "కర్ణాటక రాజ్య ప్రశస్తి" పురస్కారాల ప్రదానకార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ సమాజంలోని విభిన్న జీవన రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రకటించిన "రాజ్య ప్రశస్తి" పురస్కారాలను ఐ.జే.యు. జాతీయ నాయకుల చేతులమీదుగా ప్రదానం చేశారు.

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీయూడబ్ల్యూజే ) అధ్యక్షుడు కే. విరాహత్ అలీ తెలంగాణ రాష్ట్ర నివేదికను సమర్పించారు.

## చదువుతో ఎదగాలి.. ఐక్యతతో బలపడాలి



**ముద్ర, హైదరాబాద్:** బైండ్ల సమాజం విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ బైండ్ల ఉద్యోగుల సంఘం (BEAT) విజన్ మీట్–2026లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల చదువును మధ్యలో ఆపకుండా ఉన్నత విద్య అందించాలని, ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 'పే బ్యాక్ టు సొసైటీ' స్ఫూర్తితో సమాజానికి సేవ చేయాలని కోరారు. బైండ్ల భవన్ నిర్మాణానికి తొలి విడతగా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. BEATను బలోపేతం చేసి రాష్ట్రవ్యాప్తంగా బైండ్ల ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువతను ఏకతాటిపైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## ఉప్పుగూడ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన గుత్తా సుఖేందర్ రెడ్డి



ముద్ర, హైదరాబాద్ : ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా ఓల్డ్ సిటీలోని ఉప్పుగూడ శ్రీ మహంకాళి అమ్మవారికి తెలంగాణ ప్రభుత్వం తరపున శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, వేద అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించిన అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ అలంపల్లి నర్సింహా, ఆలయ కమిటీ చైర్మన్ మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు



ముద్ర, హైదరాబాద్ లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయి కుమార్, సరితా తిరుపతయ్య యాదవ్, భాస్కర్, అజయ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన స్పీకర్

ముద్ర హైదరాబాద్ : మీరాలం మండిలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆషాఢ బోనాల సందర్భంగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం తరపున నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, సభ్యులు, వేద అర్చకులు, స్థానిక నాయకులు స్పీకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయురారోగ్యాలు కలగాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసే శక్తిని అమ్మవారు ప్రసాదించాలని ప్రార్థించినట్లు చెప్పారు. బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## వరంగల్ జ్ఞాపకాలు.. పోలీసింగ్‌కు కొత్త సవాళ్లు

వరంగల్, ఆగస్టు 9: నక్సలిజం నుంచి సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రత వరకు పోలీసింగ్‌లో భారీ మార్పులు వచ్చాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. మౌలిక పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూనే సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. 2025లో 10,722గా ఉన్న కేసులు 2026లో 10,526కు తగ్గాయని తెలిపారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గినట్లు చెప్పారు.వరంగల్ విద్యా కేంద్రం కావడంతో డ్రగ్స్ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, కాళేశ్వర జోన్ డీఐజీ–రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఈగల్ ఎస్పీ గిరిధర్, సీఎస్‌బీ ఎస్పీ సాయిశ్రీ , అధికారులు పాల్గొన్నారు.

## అందాల పోటీల్లో తెలంగాణ వెలుగులు..

**మిస్ ఇండియా యూనివర్స్ ఫస్ట్ రన్నరప్‌గా వైరా యువతి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 9:** ఐర్లాండ్ లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'మిస్ ఇండియా యూనివర్స్–2026' అందాల పోటీల్లో తెలంగాణ రాష్ట్ర యువతి తన సత్తా చాటారు. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన మాదినేని నిఖిత ఈ పోటీల్లో ప్రథమ రన్నరప్‌గా నిలిచి అపూర్వ విజయాన్ని అందుకున్నారు. ఈ ఘనతతో అంతర్జాతీయ, జాతీయ వేదికలపై వైరా పేరుతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ఎలుగెత్తి చాటారు.వైరా పట్టణంలోని బీఆర్ఎస్ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత–ప్రసాద్ దంపతుల కుమార్తె అయిన నిఖిత, చిన్నతనం నుంచే ప్రతిభావంతురాలిగా గుర్తింపు పొందారు. విదేశీ గడ్డపై వివిధ ప్రాంతాల నుంచి పోటీపడిన ప్రతిభావంతులైన ముద్దుగుమ్మలను వెనక్కి నెట్టి, తన వ్యక్తిత్వం, సమయస్ఫూర్తి, సౌందర్యంతో న్యాయనిర్ణేతలను మెప్పించి ఈ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

**వెల్లువెత్తిన అభినందనలు:**

ఐర్లాండ్ లో జరిగిన పోటీల్లో నిఖిత ప్రథమ రన్నరప్‌గా నిలిచారన్న వార్త తెలియగానే వైరా పట్టణంలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు తీపి పదార్థాలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

నిఖిత సాధించిన ఈ ఘనవిజయంపై స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు, వైరా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి అంతర్జాతీయ వేదికపై ప్రతిభ చాటిన నిఖిత నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## పాతబస్తీ హిందువులదే..

**భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మరుస్తాం**
**- కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్**



**ముద్ర , హైదరాబాద్** :లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ సీఎం కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో తాను భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటే కేటీఆర్ హేళన చేశారని, ఇప్పుడు ఆయనే అమ్మవారిని దర్శించుకున్నారని వ్యాఖ్యానించారు. ఇది భాగ్యలక్ష్మి అమ్మవారి మహిమేనని అన్నారు.లాల్ దర్వాజ ఉజ్జయిని మహంకాళి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు ఇస్తామని గతంలో కేసీఆర్ హామీ ఇచ్చి అమలు చేయలేదని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బోనాల నిర్వహణకు కేవలం రూ.5.50 లక్షలు కేటాయించడం సరికాదని విమర్శించారు. పాతబస్తీలో హిందువులు చెల్లించే పన్నుల నిధులతో హిందూ ఆలయాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే పాతబస్తీలో బోనాల ఉత్సవాలను భారీగా నిర్వహిస్తామని, చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ తరహాలో అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. హిందూ సమాజం ఐక్యంగా ఉండాలని, యువత ఆధ్యాత్మికతతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## కేసీఆర్ సీఎంగా ఉంటే ఏపీ ఇంత ధైర్యం చేసేదా ?

**జీఆర్ఎంబీ అజెండాపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ నీటి ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నెల 18న జరగనున్న గోదావరి నదీ యాజమాన్య బోర్డు (GRMB) సమావేశ అజెండాలో తెలంగాణ ప్రాజెక్టులకు గతంలో లభించిన అనుమతులపై పునఃసమీక్ష ప్రతిపాదనలను చేర్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.కేంద్రం ఇప్పటికే అనుమతులు ఇచ్చిన తెలంగాణలోని ఏడు ప్రాజెక్టులపై మళ్లీ సమీక్ష చేయాలన్న ఏపీ ప్రతిపాదనను GRMB అజెండాలో చేర్చడం సమంజసం కాదని హరీష్ రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇంతకాలం దీనిపై ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఏపీ ప్రభుత్వం ఇలాంటి ధైర్యం చేసేదా అని వ్యాఖ్యానించారు.

చంద్రబాబు పట్ల ఉన్న అభిమానంతోనే రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని హరీష్ రావు ఆరోపించారు. కాళేశ్వరం, సీతారామతో పాటు కీలక ప్రాజెక్టులకు గతంలో సాధించిన అనుమతులను రద్దు చేసే పరిస్థితి తీసుకురావడం తెలంగాణ రైతులకు అన్యాయం చేయడమే నన్నారు. ముఖ్యంగా 47 టీఎంసీల సామర్థ్యం కలిగిన సమ్మక్క సారక్క సాగర్ ప్రాజెక్టుపైనా ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని హరీష్ రావు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణకు, ముఖ్యంగా రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. నీటి విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే ప్రజలు సహించరని హెచ్చరించారు.GRMB అజెండాపై తెలంగాణ ప్రభుత్వ అధికారిక వైఖరిని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే వెల్లడించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టం చేయాలని కోరారు.

## నా అల్లుడు 25 మందిని పెళ్లి చేసుకున్నాడు..

**బీజేపీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు**



**ముద్ర, ఢిల్లీ** : ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ బీజేపీ ఎమ్మెల్యే తన అల్లుడిపై చేసిన సంచలన ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తన అల్లుడు ఒకరిని కాదు.. ఏకంగా 25 మందిని వివాహం చేసుకుని మోసం చేశాడని బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ ఆరోపించారు. ఫేక్ ఐడీలను ఉపయోగిస్తూ పలువురు మహిళలను పెళ్లి చేసుకుని మోసం చేసినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ కుమార్తె ప్రజ్ఞకు 2024లో ప్రఖార్ త్రివేదితో వివాహం జరిగింది. ప్రఖార్ తనను రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పరిచయం చేసుకుని ప్రజ్ఞను వివాహం చేసుకున్నాడని ఎమ్మెల్యే ఆరోపించారు. అయితే పెళ్లి తర్వాత అతడి వ్యవహార శైలిపై అనుమానాలు కలిగాయని, ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా ప్రఖార్‌కు సంబంధించిన పలు విషయాలు తమ దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. తన అల్లుడు ప్రఖార్ త్రివేది ఫేక్ ఐడీలను ఉపయోగించి పలువురు మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారిని వివాహం చేసుకున్నాడని జ్ఞాన్ తివారీ ఆరోపించారు. ఇప్పటివరకు సుమారు 25 మంది మహిళలను వివాహం చేసుకుని వారిని మోసం చేసినట్లు ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రఖార్‌తో పాటు అతడి తండ్రి అనుజ్ త్రివేది పాత్రపైనా అనుమానాలు ఉన్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు.తన కుమార్తెను కూడా ఇదే తరహాలో మోసం చేసి పెళ్లి చేసుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, తన అల్లుడు ప్రఖార్ త్రివేది, అతడి తండ్రి అనుజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద FIR నమోదు చేసినట్లు సమాచారం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 10.08.2026
www.mudranews.in
@mudranews
mudratv



## వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

### కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీకి

# అడ్డు కట్ట లేదా?



విద్య వ్యాపారమైపోయింది.. ఫీజులు దోపిడీగా మారాయి.. విద్యార్థుల ప్రాణాలు మాత్రం విలువలేనివిగా మారుతున్నాయా..? చదువు అనేది ప్రతి విద్యార్థి హక్కు. తల్లిదండ్రుల ఆశ. ఒక కుటుంబం భవిష్యత్తుపై పెట్టుకునే పెట్టుబడి. కానీ నేడు ఆ చదువే కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలకు కోట్ల రూపాయల వ్యాపారంగా మారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యలో కార్పొరేట్ కాలేజీల ఆధిపత్యం పెరిగిన కొద్దీ.. ఫీజుల భారం తల్లిదండ్రులపై అంతకంతకూ పెరుగుతోంది.

ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో విద్యార్థులను అవమానించడం, వారి మానసిక స్థితిని పట్టించుకోకపోవడం, తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకోకపోవడం వంటి ఘటనలు అప్పుడప్పుడూ వెలుగులోకి వస్తున్నాయి. అయితే ప్రశ్న ఒక్కటే.. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదు..?

ఇటీవల శ్రీ చైతన్య విద్యాసంస్థకు సంబంధించిన ఓ ఘటనలో ఫీజు చెల్లింపు అంశం చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక టీనేజ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు, బాధ్యత ఎవరిది అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉన్నప్పటికీ.. అసలు ప్రశ్న మాత్రం తప్పించుకోలేనిది.

ఒక విద్యార్థి ప్రాణం పోయేంత వరకు పరిస్థితి ఎందుకు వెళ్లింది..?

ఒక విద్యార్థి ఫీజు చెల్లించలేకపోతే.. అతడిని అవమానించడమే పరిష్కారమా? తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని ప్రశ్నించడమే విద్యా సంస్థల బాధ్యతా? ఫీజు చెల్లించలేని విద్యార్థికి విద్యను కొనసాగించే అవకాశం కల్పించడం, అతని మానసిక స్థితిని గమనించడం, కౌన్సెలింగ్ అందించడం వంటి కనీస బాధ్యతలు విద్యాసంస్థలకు ఉండవా?

ఇది ఒక్క కాలేజీకి సంబంధించిన ప్రశ్న కాదు. మొత్తం ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను కుదిపే ప్రశ్న.

ఫీజులకు హద్దు ఎక్కడ..?

కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో ఫీజులు ఏ స్థాయిలో ఉన్నాయి? తల్లిదండ్రుల నుంచి ఏ పేర్లతో ఎంత వసూలు చేస్తున్నారు?

ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, మెటీరియల్, టెస్ట్ సిరీస్, ప్రత్యేక కోచింగ్, ఇతర ఛార్జీల పేరుతో వసూలవుతున్న మొత్తాలకు సరైన నియంత్రణ ఉందా?

ఒక మధ్యతరగతి కుటుంబం తమ పిల్లలను చదివించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తే.. ఆ విద్యా విధానాన్ని అభివృద్ధి అంటామా?

ఏడాదికి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నప్పుడు ఆ ఫీజుకు చట్టబద్ధమైన ప్రాతిపదిక ఏమిటి?

ఫీజు వసూళ్లపై నిబంధనలు ఉంటే అవి అమలు అవుతున్నాయా? అమలు కాకపోతే వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు?

1984 నాటి క్యాపిటేషన్ ఫీజు నిషేధ చట్టం ఉంది. నిబంధనలు ఉన్నాయి. విద్యాశాఖ ఉంది. ఇంటర్ బోర్డు ఉంది. జిల్లా స్థాయిలో అధికారులు ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఉంది. ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

కానీ విద్యార్థులపై ఫీజుల భారం మాత్రం ఎందుకు తగ్గడం లేదు..?

చట్టాలు కాగితాలపైనే ఉంటే.. వాటి వల్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రయోజనం ఏమిటి?

విద్యార్థి ప్రాణం పోయిన తర్వాతే స్పందించాలా..?

మన విద్యా వ్యవస్థలో మరో విషాదకరమైన ధోరణి కనిపిస్తోంది. సమస్య ఉన్నప్పుడు స్పందన ఉండదు. ఒక ఘటన సంచలనంగా మారిన తర్వాతే అధికారులు కదులుతారు. కొద్దిరోజులు హడావుడి ఉంటుంది. విచారణలు ప్రకటిస్తారు. ఆ తర్వాత మళ్లీ పరిస్థితి యథాతథం.

ఇది ఎందుకు?

విద్యార్థుల ఆత్మహత్యలు కనపడటం లేదా..?
వారి ఆర్తనాదాలు వినపడటం లేదా..?
తల్లిదండ్రుల కన్నీళ్లు కనిపించటం లేదా..?

విద్యార్థులపై చదువు పేరుతో పడుతున్న ఒత్తిడి గురించి ఎన్నో సంవత్సరాలుగా చర్చ జరుగుతోంది. అయినా వ్యవస్థలో మాత్రం పెద్దగా మార్పు కనిపించడం లేదు.

మార్కులు కావాలి. ర్యాంకులు కావాలి. ఫీజులు కావాలి. ఫలితాలు కావాలి.

కానీ ఆ మార్కుల వెనుక ఉన్న విద్యార్థి మానసిక పరిస్థితి ఎలా ఉంది? అతడు ఎంత ఒత్తిడిలో ఉన్నాడు? అతని కుటుంబం ఎంత ఆర్థిక భారాన్ని మోస్తోంది? అనే ప్రశ్నలు ఎక్కడ?

అధికారులు ఎవరి కోసం..?

ఇంటర్ బోర్డు అధికారుల బాధ్యత ఏమిటి? ఉన్నత విద్యాశాఖ అధికారుల బాధ్యత ఏమిటి? ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియంత్రణ వ్యవస్థలు ఏం చేస్తున్నాయి? ప్రజా ప్రతినిధులు ఎందుకు ప్రశ్నించడం లేదు?

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలంటే ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోంది అన్న అనుమానాలు ప్రజల్లో కలగడం సహజమే.

ప్రతి విద్యాసంస్థ చట్టానికి లోబడే నడవాలి. అది ఎంత పెద్ద సంస్థ అయినా, ఎంత ప్రభావవంతమైన యాజమాన్యం అయినా.. విద్యార్థుల హక్కుల విషయంలో రాజీ ఉండకూడదు.

విద్యార్థి కంటే సంస్థ పెద్దది కాదు.
ఫీజు కంటే ప్రాణం విలువైనది.
ర్యాంకు కంటే మనిషి ముఖ్యం.

ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

రాజకీయ విరాళాలపై కూడా సమాధానం కావాలి

ఇంకో ముఖ్యమైన ప్రశ్నను కూడా విస్మరించలేం.

ఒక కార్పొరేట్ విద్యాసంస్థ నుంచి ఒక ప్రముఖ రాజకీయ పార్టీకి వందల కోట్ల రూపాయల విరాళం వెళ్లినట్లు అధికారిక వివరాలు వెలుగులోకి వచ్చిన సందర్భంలో.. ఆ విద్యా సంస్థల ఆర్థిక లావాదేవీలపై మరింత పారదర్శకత అవసరం కాదా?

విరాళం ఇవ్వడం చట్టబద్ధమైన ప్రక్రియలో జరిగిందా? జరిగితే దాని వివరాలు ఏమిటి? విద్యా సంస్థల ఆదాయాలు, ఖర్చులు, ఫీజు వసూళ్లు, విరాళాలు అన్నీ పారదర్శకంగా ఉండాల్సిన అవసరం లేదా?

ఇక్కడ ఎవరినీ ముందుగానే నిందించడం కాదు. కానీ ప్రజలకు అనుమానం కలిగే పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి అన్నదే అసలు ప్రశ్న.

అలాగే "లంచాల రూపంలో ప్రతి ఏడాది ఎంత మందికి, ఎన్ని కోట్లు అందుతున్నాయి?" అనే ఆరోపణలు వినిపిస్తే వాటిని కూడా రాజకీయ ఆరోపణలుగా వదిలేయకుండా సంబంధిత దర్యాప్తు సంస్థలు, పన్ను అధికారులు, విద్యాశాఖలు అవసరమైతే విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి.

నిజం ఉంటే బయటకు రావాలి. ఆరోపణలు అబద్ధమైతే అవి కూడా తేలాలి.

ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు ఇంతకంటే మంచి మార్గం మరొకటి లేదు.

కార్పొరేట్ కాలేజీలు ఉండొద్దని కాదు.. నియంత్రణ ఉండాలి

ఇక్కడ మరో విషయం స్పష్టంగా చెప్పాలి. కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండకూడదని ఎవరూ చెప్పడం లేదు. మంచి మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, పోటీ పరీక్షలకు శిక్షణ వంటి అంశాల్లో ప్రైవేట్ విద్యాసంస్థలు అందిస్తున్న సేవలకు కూడా విలువ ఉంది.

కానీ విద్యను వ్యాపారంగా నిర్వహించడం ఒక విషయం.. విద్యార్థుల బలహీనతలను, తల్లిదండ్రుల ఆశలను ఉపయోగించుకుని ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయడం మరో విషయం.

నియంత్రణ లేని విద్యా వ్యాపారం చివరికి విద్యార్థులపైనే భారం మోపుతుంది.

అందుకే ప్రభుత్వం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది.

అన్ని జూనియర్ కాలేజీల ఫీజులపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి.
వసూలు చేస్తున్న ప్రతి ఫీజుకు రసీదు తప్పనిసరి చేయాలి.
అనధికారిక ఛార్జీలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
ఫీజు చెల్లించలేని విద్యార్థులను అవమానించే చర్యలను పూర్తిగా నిషేధించాలి.
విద్యార్థుల మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి.
విద్యార్థులపై ఒత్తిడి, వేధింపులపై ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
ఫీజు దోపిడీపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ జరగాలి.
విద్యాసంస్థల ఆర్థిక వ్యవహారాల్లో అవసరమైన స్థాయిలో పారదర్శకత తీసుకురావాలి.
నిబంధనలు ఉల్లంఘించే కాలేజీల గుర్తింపును రద్దు చేసేంత కఠినమైన చర్యలుండాలి.

ఇవన్నీ కాగితాలపై మాత్రమే కాకుండా క్షేత్ర స్థాయిలో అమలు కావాలి.

ఒక విద్యార్థి ప్రాణం.. ఒక కుటుంబం విషాదం

ఒక విద్యార్థి చనిపోతే వార్తగా మారుతుంది. రెండు రోజులు చర్చ జరుగుతుంది. సోషల్ మీడియాలో పోస్టులు వస్తాయి. రాజకీయ నాయకులు స్పందిస్తారు. అధికారులు విచారణ ప్రకటిస్తారు.

ఆ తర్వాత?

ఆ కుటుంబానికి మాత్రం జీవితాంతం మిగిలేది ఆ బాధే.

ఒక తల్లి తన బిడ్డను కోల్పోతుంది. ఒక తండ్రి తన ఆశను కోల్పోతాడు. ఒక కుటుంబం తన భవిష్యత్తును కోల్పోతుంది.

అందుకే ఈ ఘటనలను కేవలం ★★"మరో విద్యార్థి ఆత్మహత్య"★★గా చూసే ప్రమాదకరమైన నిర్లక్ష్యాన్ని వ్యవస్థ విడిచిపెట్టాలి.

ప్రతి ఘటన వెనుక కారణాలను తెలుసుకోవాలి. బాధ్యులు ఎవరైనా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులను రక్షించే విధానాలను రూపొందించాలి.

లేకపోతే మనం విద్యార్థులకు చదువు అందిస్తున్నామా? లేక ర్యాంకులు, ఫీజులు, ఒత్తిడి పేరుతో వారిని ఒక కనిపించని పోటీ యంత్రంలోకి నెట్టేస్తున్నామా?

ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి.

కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీకి ఇకనైనా అడ్డు కట్ట వేయాలి.
విద్యను వ్యాపారంగా మార్చే వ్యవస్థపై నియంత్రణ రావాలి.
విద్యార్థి ప్రాణం కంటే ఫీజు రసీదుకు విలువ ఎక్కువ కాకూడదు.
ఒక్క విద్యార్థి ప్రాణం కూడా వృథా కాకుండా ప్రభుత్వం, విద్యాశాఖ, కాలేజీ యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాలి.

లేకపోతే ప్రతి విషాదం తర్వాత "ఎందుకు ఇలా జరిగింది?" అని ప్రశ్నించుకోవడం తప్ప.. 'ఇకపై ఇలా జరగకుండా ఏం చేశాం?' అని చెప్పుకునే పరిస్థితి ఎప్పటికీ రాదు.

# జీవిత సత్యాలు

### శ్రీ రామకృష్ణ పరమహంస గారి 30 అమూల్య సూక్తులు

భగవంతుని పొందడమే మానవ జన్మకు పరమార్థం.

దేవుని కోసం నిజమైన వ్యాకులత ఉంటే ఆయన తప్పకుండా దర్శనమిస్తాడు.

అన్ని మతాలు ఒకే సత్యాన్ని చేరే భిన్న మార్గాలు.



జీవసేవే శివసేవ.

అహంకారం ఉన్నంత వరకు భగవంతుని అనుభవించలేం.

భక్తి ఉన్న చోట భయం ఉండదు.

దేవుని నామస్మరణ మనస్సును పవిత్రం చేస్తుంది.

సత్యమే కలియుగంలో గొప్ప తపస్సు.

ప్రేమతో చేసిన ప్రార్థనకు దేవుడు స్పందిస్తాడు.

భగవంతునిపై విశ్వాసం ఉంటే అసాధ్యమూ సాధ్యమవుతుంది.

మనసు నిర్మలంగా ఉంటే దేవుడు అందులో ప్రతిబింబిస్తాడు.

కామ, క్రోధ, లోభాలను జయించడం నిజమైన విజయం.

సద్గురువు మార్గదర్శకత్వం ఆధ్యాత్మిక జీవితానికి గొప్ప వరం.

వినయం జ్ఞానానికి అలంకారం.

ప్రేమే భగవంతుని చేరుకునే సులభమైన మార్గం.

స్వార్థాన్ని విడిచిపెడితే హృదయం దివ్యమవుతుంది.

పరులను నిందించవద్దు; ముందుగా తనను తాను పరిశీలించుకోవాలి.

ప్రతి జీవిలో దేవుణ్ణి దర్శించండి.

భక్తి, జ్ఞానం, కర్మ—అన్నీ భగవంతుని చేరే మార్గాలే.

శాంతి బయట కాదు, మన హృదయంలోనే ఉంది.

సత్సంగం మన జీవితాన్ని మారుస్తుంది.

దేవుని దయ లేకుండా ఏదీ సాధ్యం కాదు.

నిజాయితీ ఉన్నవారిని దేవుడు ఎప్పుడూ కాపాడుతాడు.

మనస్సును నియంత్రించడమే సాధన.

సహనం గొప్ప శక్తి.

భగవంతుని కృప లభిస్తే అజ్ఞానం తొలగిపోతుంది.

దయ, కరుణ ఉన్న హృదయం దేవాలయంతో సమానం.

ఆచరణలేని జ్ఞానం ఫలించదు.

ప్రేమతో చేసే సేవే నిజమైన పూజ.

భగవంతుని ఎల్లప్పుడూ స్మరిస్తూ జీవించడం నిజమైన ఆనందానికి మూలం.

### విశ్రాంతే కాదు..,

# కదలిక అవసరం

వృద్ధాప్యంలో ఒక వ్యక్తి ఎక్కువ రోజులు మంచానికే పరిమితమైతే, "విశ్రాంతి తీసుకోండి.. తొందరపడకండి" అని మాత్రమే చెప్పడం కొన్నిసార్లు ప్రమాదకరంగా మారుతుంది. వృద్ధులకు విశ్రాంతి ఎంత అవసరమో, వారి శారీరక సామర్థ్యానికి అనుగుణంగా కదలికలు అంతే అవసరం.





వృద్ధులు ఎక్కువకాలం మంచంలోనే ఉంటే కండరాల బలం వేగంగా తగ్గుతుంది. కొద్ది రోజులు నడవలేకపోవడం వల్ల మొదలైన బలహీనత, ఎక్కువకాలం కొనసాగితే నిలబడటం, నడవటం, స్వయంగా పనులు చేసుకోవడం కూడా కష్టమవుతుంది.

ఎక్కువసేపు మంచానికే పరిమితమవడం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్లు, రక్తం గడ్డకట్టడం, బెడ్‌సోర్లు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా శస్త్రచికిత్స, ఫ్రాక్చర్ లేదా స్ట్రోక్ తర్వాత వైద్యుల సూచనల మేరకు పునరావాస చికిత్స ముఖ్యమైంది.

ఒక వృద్ధుడు స్వయంగా చేయగలిగే పనులను కుటుంబ సభ్యులు పూర్తిగా చేసి పెట్టడం కూడా మంచిది కాదు. ప్రేమతో చేసే సహాయం అవసరమే కానీ, చేయగలిగిన పనిని స్వయంగా చేయడానికి ప్రోత్సహించడం శారీరక స్వాతంత్ర్యాన్ని కాపాడుతుంది.

శస్త్రచికిత్స లేదా అనారోగ్యం తర్వాత "ఎప్పుడు కదలడం ప్రారంభించాలి?" అనే విషయంలో వైద్యుడి సలహా చాలా ముఖ్యం. ప్రతి రోగికి ఒకే విధమైన వ్యాయామం సరిపోదు. ఫ్రాక్చర్, హిప్ రీప్లేస్‌మెంట్, స్ట్రోక్ వంటి పరిస్థితుల్లో ఫిజియోథెరపిస్ట్ సూచనలను తప్పకుండా పాటించాలి.

కదలిక అంటే వెంటనే ఎక్కువగా నడవడం కాదు. మొదట మంచంలోనే కాళ్లు, చేతుల చిన్న వ్యాయామాలు, తర్వాత కూర్చోవడం, ఆపై సహాయంతో నిలబడటం, పరిస్థితిని బట్టి నడవడం వంటి దశలవారీ పునరావాసం అవసరం.

వృద్ధుడు నొప్పి, అలసట లేదా భయాన్ని వ్యక్తం చేస్తే బలవంతం చేయకూడదు. అదే సమయంలో 'ఏమీ చేయకండి... ఎప్పుడూ పడుకునే ఉండండి' అని కూడా చెప్పకూడదు. వైద్యుల సూచనలతో, సురక్షితంగా, కొద్దికొద్దిగా కదలికలను పెంచాలి.

నిజమైన సేవ అంటే వృద్ధుడి ప్రతి పనినీ మనమే చేయడం మాత్రమే కాదు. సాధ్యమైనంతవరకు వారు స్వయంగా కూర్చోవడం, నిలబడడం, నడవడం, భోజనం చేయడం, మరుగుదొడ్డికి వెళ్లడం వంటి రోజువారీ పనులను చేసుకునేలా సహాయం చేయడం.

ముఖ్యంగా తల్లిదండ్రులు లేదా వృద్ధ కుటుంబ సభ్యులు అనారోగ్యం నుంచి కోలుకుంటున్నప్పుడు వారి మనోధైర్యాన్ని పెంచాలి. "మీరు చేయగలరు.. నెమ్మదిగా ప్రయత్నిద్దాం.. నేను మీతోనే ఉన్నాను" అనే మాటలు వారికి ఎంతో ధైర్యాన్ని ఇస్తాయి.

వృద్ధాప్యంలో మన లక్ష్యం కేవలం ఎక్కువ రోజులు జీవించడం మాత్రమే కాదు–సాధ్యమైనంతవరకు స్వయంగా నిలబడటం, నడవటం, రోజువారీ పనులు చేసుకోవడం, ఆత్మగౌరవంతో జీవించడం. అందుకే "విశ్రాంతి తీసుకోండి" అనే మాటతో పాటు, "మీకు వీలైనంత వరకు సురక్షితంగా కదలండి.. నేను మీకు సహాయం చేస్తాను" అని చెప్పడం కూడా నేర్చుకుందాం.

# అమ్మాయిల కొత్త కోరికలు!

### లక్షల్లో జీతం, కోట్లలో ఆస్తి, విదేశాల్లో స్థిరపడడం

లక్షల్లో జీతం, కోట్లలో ఆస్తి, విదేశాల్లో స్థిరపడటం... ఒకప్పుడు పెళ్లి సంబంధం కుదరాలంటే ఇవే మెయిన్ క్వాలిఫికేషన్స్. కానీ, ఇప్పుడు ట్రెండ్ రివర్స్ అయింది! 'రూపం కంటే గుణం ముఖ్యం' అనే సామెతను పక్కన పెట్టేసి.. కోట్ల జీతం కంటే, తలపై జుట్టే ముఖ్యమని యువత తెగేసి చెబుతోంది. పెళ్లిళ్లలో వైరల్ అవుతున్న ఈ క్రేజీ ట్రెండ్స్, యువత మైండ్‌సెట్ మార్పు గురించి మనము తెలుసుకుందాం..

**జీతం కాదు.. లుక్సే మేయిన్ మేటర్**

ఈ రోజుల్లో పెళ్లి సంబంధాల మార్కెట్ పూర్తిగా మారిపోయింది. అబ్బాయికి ఎంత పెద్ద ఉద్యోగం ఉన్నా, బ్యాంక్ బ్యాలెన్స్ కోట్లలో ఉన్నా సరే.. చూడటానికి స్మార్ట్‌గా లేకపోతే అమ్మాయిలు రిజెక్ట్ చేస్తున్నారు. ముఖ్యంగా బట్టతల ఉన్న అబ్బాయిలను పెళ్లి చేసుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపించడం లేదని మ్యాచ్‌మేకర్లు చెబుతున్నారు.

**అబ్బాయిల్లో అభద్రతాభావం**

జీవితంలో ఎంతో కష్టపడి, మంచి పొజిషన్‌కు రీచ్ అయినా.. కేవలం లుక్స్ బాలేవనే కారణంతో రిజెక్షన్స్ ఎదురవుతుండటంతో అబ్బాయిల్లో అభద్రతాభావం పెరిగిపోతోంది. ఇక కెరీర్ పక్కన పెట్టి మరీ హెయిర్ ప్లాంటేషన్లు, బ్యూటీ ట్రీట్‌మెంట్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 10.08.2026
www.mudranews.in | @mudranews



### తాగునీటి నాణ్యతకు



నీటి ట్యాంక్, ఫిల్టర్ శుభ్రత చూడండి నీటి నాణ్యతకు ఫిల్టర్, నిల్వ ట్యాంక్ శుభ్రత కూడా చాలా ముఖ్యం. ఫిల్టర్లను సమయానికి మార్చడం, ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం అవసరం.

# ఘనంగా బోనాల ఉత్సవాలు

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి ప్రాంతంలోని పలు దేవాలయాల్లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బోనాల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ నల్ల పోచమ్మ ఆలయం, లాలాపేటలోని పోచమ్మ ఆలయం, మల్కాజిగిరిలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో జరుగుతున్న బోనాల ఉత్సవాలను పరిశీలించి, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని ఆయా ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించారు.



అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలయ కమిటీలు, పోలీసు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. కాప్రా పరిధిలోకాప్రా శంఖ కాలనీలోని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బోనాల సందర్భంగా ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.శ్రీ నివాస ఆఫీసర్స్ కాలనీ, అయోధ్య నగర్‌తో పాటు పరిసర కాలనీలకు చెందిన మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను సిద్ధం చేసుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు.బోనాల వేడుకలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరిసర కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో శంఖ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

## అక్కన్న మాదన్న అమ్మవార్లకు పట్టువస్త్రాలు

### ప్రభుత్వం తరపున సమర్పించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు





**ముద్ర, హైదరాబాద్:** ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ హరిబౌలిలోని చారిత్రక శ్రీ అక్కన్న మాదన్న ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ప్రతి సంవత్సరం ఆషాఢ బోనాల సందర్భంగా ఇక్కడ ప్రత్యేక పూజలు, బోనం సమర్పణ, పట్టువస్త్రాల సమర్పణ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. మంత్రి శ్రీధర్‌బాబు అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాలను ఆకాంక్షించినట్లు తెలిపారు. .గతేడాది కూడా ఇదే ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి శ్రీధర్‌బాబు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బోనాల ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం

### కొత్త పార్టీకి అమ్మవారి ఆశీర్వాదం కోరుకున్న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత



**ముద్ర, హైదరాబాద్:** బోనాల ఏర్పాట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం సింహవాహిని అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని అమ్మవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ధ్వజస్తంభం ఏర్పాటు, విగ్రహ పునఃప్రతిష్ఠ వంటి అనేక అంశాలను అమ్మవారు ప్రస్తావిస్తున్నారని, ప్రభుత్వం ఈ విషయాలను సీరియస్‌గా తీసుకుని బోనాల ఏర్పాట్లను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. బోనం ఎత్తుకుని సింహవాహిని అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన ఆడబిడ్డలందరికీ శుభా కాంక్షలు తెలిపారు. అమ్మవారి దయతో వారి కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కొత్త పార్టీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో అమ్మవారి ఆశీర్వాదం కోరేందుకు తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఒక ఆడబిడ్డగా కొత్త పార్టీని స్థాపించి ప్రజల ముందుకు వస్తున్నానని, తమ పార్టీకి అమ్మవారి ఆశీస్సులతో కొత్త శక్తి, ప్రజలకు సేవ చేసే సత్తువ కల్పించాలని ప్రార్థించినట్లు చెప్పారు.

## పోచమ్మ దేవాలయానికి పోటెత్తిన భక్త జనం

### రాజీవ్ కాలనీలో ఘనంగా బోనాల పండుగ



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** గ్రామీణ జీవన సంస్కృతికి, పల్లె జీవన విధానానికి, తెలంగాణ ఆడబిడ్డలు అందించే ఒక అద్భుతమైన నివాళి బోనాల పండుగ అని రాజీవ్ కాలనీ పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అంతటా జరుపుకునే పండుగల్లో ఎంతో ప్రాముఖ్యమైనది బోనాల పండుగ ఈ పండగ ఆషాఢ మాసంలో ప్రారంభమై శ్రావణమాసం చివరిదాకా జరుపుకుంటారు. తాండూర్ పట్టణంలోని ఎనిమిదవ వార్డులో హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల రాజీవ్ కాలనీలో ఆదివారం రోజున ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భారీ సంఖ్యలో ఆడపడుచులు బోనాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు పునకాలతో ఊగిపోతూ చేసే నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకర్షించాయి. రాజీవ్ కాలనీ తో పాటు ఇందిరమ్మ కాలనీ లోని ఆడపడుచులు బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయం వద్ద వరకు నృ త్యాలు చేస్తూ చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. బోనాల పండుగను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులుఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోచమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు, భవాని మాత దేవాలయ కమిటీ అధ్యక్షులు, 8వ వ వార్డ్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్, రాజీవ్ కాలనీ ఇందిరమ్మ కాలనీ వాసులు, యువకులు మరియు ఆడపడుచులు, అమ్మవారి భక్తులు, చిన్నలు పెద్దలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ముద్ర, కాప్రా:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కాప్రా నాచారం మల్లాపూర్ ఉప్పల్ డివిజన్‌లోని పలు ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.బోనాలు కేవలం అమ్మవారికి సమర్పించే నైవేద్యం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తి విశ్వాసాలకు, తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పోతరాజుల వీరత్వం, డప్పుల దరువులు, అమ్మవారి ఘటాల ఊరేగింపులు, ఆడపడుచుల భక్తిశ్రద్ధలు తెలంగాణ జీవన సంస్కృతికి సజీవ రూపాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా మన సంస్కృతి, భాష, యాస, పండుగలు ప్రజలను ఏకం చేసిన శక్తిగా నిలిచాయని గుర్తుచేశారు.ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులను కలిసి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులందరికీ, ప్రజలందరికీ బోనాల పండుగ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు కొత్త రామారావు ప్రభుదాస్ శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుజిలి మహంకాళి బోనాల ఉత్సవాలు



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** లంగర్ హౌస్ బుజిలి మహంకాళి ఆలయ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బోనాల సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ భోగి బాల్ రాజ్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతిపెద్ద వైశాల్యంతో ఉన్న తొట్టెలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎల్ఈడి దీపాలతో లంగర్ హౌస్ చౌరస్తా నుండి ఆలయం వరకు వేసిన పందిరి అందర్నీ ఆకట్టుకుంది.

## సాయినాధుని కపిని వస్త్రం, పాదుకల దర్శనం

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ఓవైపు బోనాలు, మరోవైపు షిరిడి సాయినాధుని నామస్మరణతో లంగర్ హౌస్ ప్రాంతం మార్మోగింది. సాయి టెక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు దివంగత ముత్యాల కృష్ణ తన గృహాన్ని సాయిబాబా మందిరం గా మార్చారు. ఆదివారానికి ఆలయ నిర్మాణం చేసి 26 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సాక్షాత్తు షిరిడి సాయి నాధుడు ధరించిన కపిని వస్త్రం, ఆయన వేసిన పాదుకులను ముత్యాల లీలావతి ఆధ్వర్యంలో శేఖర్ బాబు, సుమలత దంపతులు షిరిడి నుండి శనివారం రాత్రి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుండి హోమము, సాయిబాబా భజనల కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో



జరిగాయి. అనంతరం కదిలింది శ్రీ సాయి పల్లకి అంటూ భజనలతో సాయినాధుని కపిని వస్త్రం, పాదుకలను అంగరంగ వైభవంగా లంగర్ హౌస్ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి సాయినాధుని పాదుకలను దర్శనం చేసుకున్నారు.

## యువకుడు మిస్సింగ్



**ముద్ర, కూకట్‌పల్లి:** తన అక్క ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయలుదేరిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో కనిపించకుండా పోయిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది.బాధితుల వివరాల ప్రకారం రామ్ నరేష్ నగర్‌లో నివాసముంటున్న నర్సింగ్ రామ్ (29, S/o సత్యయ్య) అనే ప్రైవేట్ ఉద్యోగి, ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా బోడుప్ప ల్‌లోని అక్క ఇంటి వద్ద వేడుకలు జరుపుకుంటానని తెలిపాడు. అదే రోజు ఉదయం 6:30 గంటల సమయంలో తన గది వద్ద ఉన్న స్నేహి తుడు స్వామికి బోడుప్పల్ వెళ్తున్నానని చెప్పి జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వైపు వెళ్లాడు. అనంతరం కుటుంబ సభ్యులు అతనికి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్విచ్ ఆఫ్ లేదా కాల్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి గాలింపు చేపట్టారు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. నర్సింగ్ రామ్ ఎత్తు 5.6 అడుగులు, చామనఛాయ రంగు కలిగి ఉంటాడని, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడని సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ కు భారీ స్పందన

**7,340 ఇండ్లకు 35,125 దరఖాస్తు లు**
**మరో రెండు రోజులు మాత్రమే గడువు**
**ఆగస్టు 20 తరువాత లాటరీ**
**ఏడాదిలోగా లబ్ధిదారులకు అందచేత**
**హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం**

**ముద్ర, హైదరాబాద్:** అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేద ప్రజలకు సొంతి ఇంటిని కల్పించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో నిర్మించనున్న ఫ్లాట్లకు ఇండ్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ పథకం కింద మొత్తం ఒక లక్ష ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గంలోనూ 500 ఇండ్ల చొప్పున నిర్మాణాలను చేపడు తున్నారు. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇంతవరకు ఈ ఇండ్ల కోసం శనివారం నాటికి 35,125 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల పదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి. గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత ఇంటి వసతిని కల్పించుకోవడమనేది కష్టతరమైనదిగా, భావించే అల్పాదాయ వర్గాల ప్రజలకు అందుబాటులో, అతి తక్కువ ధరలతోనే ఇంటిని సమకూర్చేలక్ష్యంతో ఈ పథకానికి రూపకల్పన చేయడం జరిగింది. అంత కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఇటువంటి పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంతో విలువైన భూముల్లో నిర్మిస్తున్న ఈ ఇండ్లను కేవలం నామమాత్రపు ధరకే అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్ లో రూ.30 నుంచి రూ.58 లక్షల వరకు ధర పలికే ఈ ఫ్లాట్లను కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం కేటాయిస్తున్నదని తెలిపారు. అంతే కాకుండా ఇండ్లు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. ప్రజలు సొంత ఇంటి కోసం తాము నివసిస్తున్న ప్రాంతాల నుంచి వలస వెళ్లకుండా, ప్రస్తుతం వారు ఉంటున్న నియోజకవర్గంలోనే సొంత ఇంటిని పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే సమయంలో ఎటువంటి కుల, ఆదాయ సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇండ్లు కేటాయించని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు ఫీజు రూ.10 వేలు తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తులను సమర్పించడానికి మరో రెండు రోజులు మాత్రమే గడవు ఉన్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**20 తరువాత లాటరీ**

దరఖాస్తులకు ఇండ్ల కేటాయింపు నకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఈ నెల 20 వ తేదీ నుంచి చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు.అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులను చేపట్టడానికి టెండర్ ప్రక్రియను కూడా చేపట్టింది. ఈ ఇండ్లన్నిటినీ ఒక ఏడాది లోపే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు ఖైరతాబాద్ 4,394, అంబర్ పేట 2,357 , బహదూర్ పుర – 1,135, ఇబ్రహీం పట్నం –749, కూకట్ పల్లి –5,233, కార్వాన్ –1,574 మహేశ్వరం –471, మలక్ పేట – 2,846, మల్కాజిగిరి–1,033, మేడ్చల్– 1,153, నాంపల్లి–3,613, సనత్ నగర్ –1,046 , కుత్బుల్లాపూర్–4,121, రాజేంద్రనగర్– 1,496, సికింద్రాబాద్ కంటోన్మెంట్ –1,374, శేరిలింగంపల్లి– 2,530 మంది ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్నారు.ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు సంబంధించి ఎటువంటి సందేహాలను తీర్చుకోడానికి కాల్ సెంటర్ ఫోన్ నెంబరు 040–24603572 ను సంప్రదించ వచ్చని వైస్ ఛైర్మన్ ఆ ప్రకటనలో సూచించారు.

## భోపాల్‌లో సత్తా చాటిన తెలంగాణ కెనోయ్ స్ప్రింట్ జట్టు

### జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పలు పతకాలు కైవసం

**ముద్ర, భోపాల్:** భోపాల్‌లో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించిన అస్మిత్ కెనోయ్ స్ప్రింట్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ కెనోయ్ స్ప్రింట్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించారు. 1000 మీటర్ల విభాగంలో తెలంగాణ క్రీడాకారులు విశేషంగా రాణించారు. కెనోయ్ సింగిల్‌లో ఎన్. బిందు వెండి పతకం సాధించగా, కెనోయ్ డబుల్‌లో పి. జస్వికి, కె. అనూష బంగారు పతకం కైవసం చేసుకున్నారు. కెనోయ్ ఫోర్‌లో కె. బిందు, పి. జస్వికి, ఆర్. రేఖ, కె. అనూషల బృందం బంగారు పతకం సాధించింది.కయాక్ విభాగంలోనూ తెలంగాణ క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. కయాక్ సింగిల్‌లో ఎం. చందన్ కాంస్య పతకం సాధించగా, కయాక్ ఫోర్‌లో ఎం. చందన్, శ్రావంతి, అవంతిక, సింధు బృందం వెండి పతకం దక్కించుకుంది.500 మీటర్ల విభాగంలో కూడా తెలంగాణ విజయ పరంపర కొనసాగింది. కెనోయ్ సింగిల్‌లో కె. అనూష వెండి పతకం సాధించగా, కెనోయ్ డబుల్‌లో ఎం. బిందు, పి. జస్వికి జోడీ బంగారు పతకం సాధించింది.జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సాధించిన ఈ విజయాలు వారి కఠోర శ్రమ, పట్టుదల, సమష్టి కృషికి నిదర్శనమని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ పేర్కొంది. పతక విజేతలను, కోచ్‌లు రామకృష్ణ, నిషితో పాటు సహాయక సిబ్బందిని అభినందించింది. రానున్న జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శనతో తెలంగాణకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 10.08.2026
www.mudranews.in | @mudranews



### అనుమానం ఉంటే ల్యాబ్ పరీక్ష తప్పనిసరి

ఇంటి పరికరాలు ప్రాథమిక అవగాహనకు మాత్రమే ఉపయోగపడతాయి. నీటిలో బ్యాక్టీరియా, భారీ లోహాలు లేదా ఇతర హానికర పదార్థాలపై అనుమానం ఉంటే అధికారిక నీటి పరీక్షా ప్రయోగశాలలో పరీక్ష చేయించుకోవాలి.



# గిరిజనుల విద్య, హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం







**ముద్ర, హైదరాబాద్:** గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

గిరిజన సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన విద్య, ఆహారం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచడంతో పాటు ఉన్నత విద్యలోనూ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గిరిజనుల అటవీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, కళల పరిరక్షణకు చర్యలు కొనసాగుతున్నాయని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ బలరాం నాయక్ కోరారు.

ఈ సందర్భంగా గిరిజన సంక్షేమం, విద్య, సంస్కృతి, హక్కుల పరిరక్షణ తదితర రంగాల్లో సేవలందించిన తొమ్మిది మంది ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసీ దినోత్సవం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టిఎన్జీవో భవనంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీల ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వం, హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీ యువత విద్య, ఉపాధి, విభిన్న రంగాల్లో ముందుకు సాగేందుకు తగిన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ నిహారిక, నిర్మల్ గ్రామీణ మండల తహసిల్దార్ ప్రభాకర్, నాయకులు మంద మల్లేష్, నైతం భీమ్ రావు, తొడసం శంభు, తొడసం గోవర్ధన్, ముసలి చిన్నయ్య, సాకి లక్ష్మణ్, సంచు శ్రీనివాస్, పెందోర్ మాధవ రావు, శంకర్, సంఘపు నరసయ్య, ఈశ్వర్, సురేశ్, వివిధ సంఘాల నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై దాడి చేసి ఆభరణాలు చోరీ

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ శివాజీనగర్‌లో వృద్ధురాలిపై దాడి చేసి బంగారు గొలుసు, చెవి కమ్మను దోచుకెళ్లిన కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. మూడో ఠాణా సీఐ తిరుమల్‌గౌడ్ శనివారం నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. శివాజీనగర్‌కు చెందిన జంగం రాజమ్మ మనవడు తరుణ్‌తో కలిసి ఉంటున్నారు. శుక్రవారం తరుణ్ ప్రైవేటు ఉద్యోగానికి వెళ్లగా రాజమ్మ ఒంటరిగా ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఓ వ్యక్తి మాస్కు ధరించి ఇంటికి వచ్చాడు. తెలిసిన వ్యక్తిలా అనిపించడంతో ఆమె పలకరించారు. వెంటనే అతడు ఇంట్లోకి చొరబడి రాజమ్మ నోరు మూసి మెడలోని బంగారు గొలుసు లాగడంతో అడ్డుకున్నారు. ముఖంపై మాస్కు లాగడానికి యత్నించగా ఆమె తలను రెండు సార్లు గోడకు గట్టిగా కొట్టగా కింద పడి రక్త గాయాలయ్యాయి. అనంతరం బంగారు గొలుసు, ఒక చెవి కమ్మ తీసుకొని ఉడాయించాడు. విషయం తెలిసిన తరుణ్ ఇంటికి చేరుకొని స్థానికుల సాయంతో రాజమ్మను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన మూడో ఠాణా పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని కిసాన్‌నగర్‌కు చెందిన మునుగొండ మధుకర్‌గా గుర్తించారు. దోపిడీ చేసిన బంగారాన్ని ఓ రుణ సంస్థలో తాకట్టు పెట్టి రూ.2.25 లక్షలు తీసుకొని తన ఖాతాలో జమ చేయించుకున్నట్లు విచారణలో తేలింది. శనివారం నిందితుడిని అరెస్టు చేసి తాకట్టు పెట్టిన ఆభరణాలు, దోపిడీకి ఉపయోగించిన బైక్, చరవాణి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో కేసు ఛేదించిన సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై చేరాలును ఉన్నతాధికారులు అభినందించారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

ముద్ర, కరీంనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సామరస్యం, భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు మాసం గణేష్,



చొప్పరి జయశ్రీ, సొగాని కొమరయ్య, నలువాల రవీందర్, పొన్నం లక్ష్మీ మొండయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు

### బోనమెత్తిన జువ్వాడి కృష్ణారావు



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణ బాలాజీ రోడ్లో గల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు లు విచ్చేసి బోనం ఎత్తుకొని పట్టణ పురవీధుల గుండా డప్పు చప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. జువ్వాడి వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్ చిట్యాల లక్ష్మీనారాయణ, నాయకులు కడకుంట్ల గంగాధర్, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి: సాయిని మల్లేశం

**- ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఏగరాలి...**
**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపు**

**ముద్ర, కరీంనగర్ :** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ను కరీంనగర్ జిల్లాలో విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ లోని శుభ మంగళ కన్వెన్షన్ హాల్ లో మండల, జోన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10 నుంచి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఆగస్టు 12 నుంచి 14 వరకు స్వాతంత్ర్య సమరయోధులు, మహాపురుషుల విగ్రహాలను శుద్ధి చేసి, పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జిల్లాలోని ప్రతి గ్రామం, కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని పార్టీ శ్రేణులు సన్మానించారు. అనంతరం



బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగా ని శ్రీనివాస్ ,రాష్ట్ర అధికార ప్రతినిధి,డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సీనియర్ నాయకులు, బాస సత్యనారాయణ రావు, కన్న బోయిన ఓదెలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ లతో పాటు జిల్లా ముఖ్యనేతలు, మండలాల, జోన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. సమావేశాన్ని అనంతరం నూతన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ను, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లను బిజెపి శ్రేణులు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ..

### ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో భక్తులు

గోవిందా హరి గోవిందా.. గోకుల నందా గోవిందా అంటూ తిరుమల లో భక్తులు స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో క్యూలైన్‌లలో నిలబడ్డారు. వారాంతపు సెలవుదినాలు కావడంతో శని, ఆదివారాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయి ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. వేంకటేశ్వరస్వామిని 87,658 మంది భక్తులు దర్శించుకోగా 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు చెల్లించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.13 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ ఆలయ అధికారులు తెలిపారు. 4.15 లక్షల లడ్డూలను విక్రయించామని, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించామని వివరించారు.

# ఫ్లెక్సీ వివాదం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ



**ముద్ర న్యూస్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత మాధవరెడ్డి వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో ఆదివారం బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో వివాదం రాజుకుంది. పోలీసులు ఫ్లెక్సీలు తొలగించి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం తమపై దాడి చేశారని ఇరు వర్గాల కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పరస్పరం పోలీసులను ఫిర్యాదు చేశారు.

# కలలో చూపిన చోట కాలభైరవ విగ్రహం..

### వెలుగులోకి పురాతన నవనాగ క్షేత్రం

**ముద్ర, చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం మదిమాణిక్యం గ్రామంలోని గ్రామదేవత పోచమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ఏలేటి సంతోష్ రెడ్డి తన సొంత ఖర్చులతో చేపడుతున్నారు. ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు బోరు, మోటార్ ఏర్పాటు చేసి, కొండపై ఉన్న ఆలయానికి భక్తులు వెళ్లేందుకు దారిని నిర్మించారు. ఇటీవల సంతోష్ రెడ్డికి రాత్రి కలలో అమ్మవారు దర్శనమిచ్చి ఓ ప్రదేశాన్ని సూచించగా, మరుసటి రోజు అక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్న సమయంలో కాలభైరవ విగ్రహం బయటపడిందని తెలిపారు. ఈ విగ్రహాన్ని ఆలయ సమీపానికి తీసుకొచ్చి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఖాశింపేట్ మానస దేవి ఆలయ ప్రధాన అర్చకులు అమర్నాథ్ ఆలయాన్ని సందర్శించి, బయటపడిన విగ్రహాన్ని పరిశీలించి ఇది పురాతన నవనాగ క్షేత్రానికి సంబంధించినదిగా పేర్కొన్నారు. త్వరలోనే నాగ క్షేత్రం ఆలయాన్ని ఏర్పాటు చేస్తామని సంతోష్ రెడ్డి తెలిపారు.



పోచమ్మ అమ్మవారు గ్రామ ప్రజలను అరిష్టాలు, వ్యాధుల నుంచి కాపాడే గ్రామదేవతగా భక్తులు విశ్వసిస్తారని ఆయన పేర్కొన్నారు. కాలభైరవ విగ్రహం బయటపడిన విషయం చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించడంతో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవారికి, కాలభైరవుడికి గ్రామస్తులు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు సంతోష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# బీజేపీ లో సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం



**ముద్ర, కోరుట్ల;** భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోపాల్ రెడ్డి కి ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల మారుతి మాట్లాడుతూ ఈ పదవి మండలానికి దక్కడం అదృష్టమని అలాగే ఈ నియమాకానికి సహకరించిన రాష్ట్ర శాఖ మరియు జిల్లా శాఖకు అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మండల శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీలో ఒక సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం అని, అలాగే ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు ఇకముందు రైతుల పక్షాన ఉండి ముందుకు వెళ్తానని నూతనంగా ఎన్నికైన గోపాల్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ నరెడ్ల రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్, సర్పంచ్ లు గుంటుక మనోహర్, మల్యాల రమేష్, ధర్మపురి స్వప్న–జలంధర్, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన కేంద్ర మంత్రి బండి సంజయ్

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లో లాల్‌దర్వాజా బోనాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆషాఢమాస బోనాల ఉత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పాతబస్తీలోని లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 10.08.2026
www.mudranews.in | @mudranews



## తాగునీటి నాణ్యతకు

టెస్ట్ స్ట్రిప్స్ ఉపయోగించండి. క్లోరిన్, నైట్రేట్ వంటి కొన్ని పదార్థాలను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న వాటర్ టెస్ట్ స్ట్రిప్స్‌ను ఉపయోగించవచ్చు. సూచనల ప్రకారం పరీక్ష చేసి ఫలితాలను పరిశీలించాలి.



# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

..**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం భువనగిరి లో ఘనంగా నిర్వహించారు. సుమంగళి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి అతిథులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ, పీసీసీ మీడియా విభాగం అధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక అయిన యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా వారోత్సవాలు నిర్వహిస్తూ యువతకు క్రికెట్ పోటీలు, ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సందేశంతో 2 కే రన్, శ్రమదానం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ కైసర్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ చిస్తి, సీనియర్ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్,, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎలిమినేటి సురేష్, పుట్ట గిరీష్,జిల్లా నాయకులు ఏడుమెకల మహేష్, బత్తిని వరుణ్, కత్తి సాయిప్రసాద్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు బట్టు సందీప్, భూషపాక శివతేజ, పోత్నక్ సన్నీ, ఎండి జలీల్, రేగు రమేష్, నాయకులు చిక్కుల వెంకటేష్ ,ఎల్లంల జంగయ్య, ఎనగండ్ల సుధాకర్, సుర్వంగ చందు, బొల్లెపల్లి వినయ్, భువనగిరి ఉపేందర్ పాల్గొన్నారు.



## నూతన ఆలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బోనాల పండుగ సందర్భంగా ఆదివారం భువనగిరి పట్టణ రైతు బజార్లో నిర్మించిన నూతన గుడిని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించి ఎల్లమ్మ , మైసమ్మ, అమ్మవారులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, రైతు బజార్ అధ్యక్షులు యట నాగరాజు మార్కెట్ డైరెక్టర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల గారు, పట్టణ నాయకులు, మండల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రమేష్ కు ఇల్లు కట్టిస్తా

### హామీ ఇచ్చిన ఈరసరపు యాదగిరి



**ముద్ర, గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన పుట్టుకతో వికలాంగుడైన సింగారం రమేష్ కు ఇల్లు లేక ఇబ్బంది పడుతుండగా బీర్ల పౌండేషన్ ద్వారా ఇంటి నిర్మాణం కొరకు ముగ్గు పో యించి నీకు ఇల్లు నిర్మిస్తా అని ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి హామీఇచ్చాడు.

## కొండమల్లేపల్లిని అభివృద్ధి చేస్తా



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి గ్రామంలోని బస్టాండ్ కు ఎదురుగా ఉన్న పాత గ్రామపంచాయతీ రోడ్డు 6వ వార్డులో కొన్ని సంవత్సరాలుగా ఉన్న సమస్యకు ఇప్పుడు పరిష్కారం లభించింది. వర్షం పడితే మురుగునీరు నిలిచి వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే ఈ రోడ్డు ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది ఫోటోలో కనిపిస్తున్నట్లు వర్షం వచ్చిన ప్రతిసారీ ఈ రోడ్డుపై మురుగునీరు, వర్షపు నీరు నిలిచేది. దీంతో ద్విచక్ర వాహనదారులు జారిపడేవారు. వ్యాపారస్తుల దుకాణాల ముందు నీరు, చెత్త పేరుకుపోయి వ్యాపారాలు దెబ్బతినేవి. పాదచారులు ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు రోడ్డు దాటడానికి కూడా ఇబ్బంది పడేవారు సర్పంచ్ వెంటనే అక్కడ సమస్యను పరిష్కారం చూపి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతులతో రోడ్డు పూర్తిగా మారిపోయింది. నీరు నిలవకుండా సరైన రోడ్డు లెవెలింగ్ పనులు చేపట్టడంతో రోడ్డుపై ప్రజలు తిరుగుతున్నారు. దుకాణాల ముందు నీరు నిలవడం తగ్గడంతో వ్యాపారస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డికి, ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, 6వ వార్డు సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో..

# ప్రజాస్వామ్య పరిరక్షణకు పునరంకితం కావాలి

### గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 9:** క్విట్ ఇండియా డే సందర్భంగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు మొహమ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో కీలక ఘట్టమని నాయకులు పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన “భారత్ విడిచి వెళ్లండి” పిలుపు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త ఊపునిచ్చిందని గుర్తుచేశారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యం కోసం వేలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళిజెండా ఆవిష్కరణ అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసిన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ తదితర నాయకుల సేవలను ఈ సందర్భంగా స్మరించారు.క్విట్ ఇండియా ఉద్యమం కేవలం బ్రిటిష్ పాలనను దేశం నుంచి వెళ్ల గొట్టాలనే నినాదం మాత్రమే కాదని, భారతీయుల ఐక్యత, ఆత్మగౌరవం, స్వేచ్ఛా కాంక్షకు ప్రతీకగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు.గాంధీ ట్రస్ట్ ప్రత్యేక ప్రదర్శనకార్యక్రమంలో భాగంగా గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తిలకించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన అరుదైన ఛాయాచిత్రాలు, చారిత్రక సంఘటనలు, మహాత్మాగాంధీ జీవిత విశేషాలు, స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలను ప్రతిబింబించే అంశాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.ప్రదర్శనలోని వివిధ విభాగాలను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడంలో ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడాలిస్వాతంత్ర్య సమరయోధులు సాధించిన స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికవాదం, స్వేచ్ఛ వంటి విలువలను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రజలు చూపిన ఐక్యత, పట్టుదల, త్యాగస్ఫూర్తి నేటి సమాజానికి కూడా ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గాంధీ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమెరికాలో వైద్య రంగంలో అరుదైన అవకాశం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** అమెరికాలోని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్, ఒహాయోలో ఫిజీసియన్ అసిస్టెంట్ క్లినికల్ అసోసియేట్‌గా ఎంపికైన డా. పారుపల్లి హిమ ప్రత్యూషను కమ్మ ఖమ్మం మహాజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్వర్ణభారతి కమ్మవారి కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు హిమ ప్రత్యూషను శాలువాతో సత్కరించి అభినందించారు.సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ మాట్లాడుతూ వైద్య విద్యలో ప్రతిభ కనబరిచి ప్రపంచ ప్రఖ్యాత క్లీవ్‌ల్యాండ్ క్లినిక్‌లో కీలక బాధ్యతకు ఎంపిక కావడం హిమ ప్రత్యూష ప్రతిభకు నిదర్శనమన్నారు. ఆమె సాధించిన విజయం ఖమ్మం జిల్లాతో పాటు తెలుగు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. కష్టపడి లక్ష్యాన్ని సాధించాలనుకునే యువతకు హిమ ప్రత్యూష ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చావా రాము తల్లిదండ్రులు పారుపల్లి అమర్ చందు , వెంకట నాగలక్ష్మి , డాక్టర్ గోర్కి, సంఘం ఉపాధ్యక్షురాలు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గిరిజనుల కలలను సాకారం చేసిన కేసీఆర్

### :మాజీ మంత్రి పువ్వాడ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల కలలను, ఆకాంక్షలను సాకారం చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కే దక్కుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూములకు పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేసి గిరిజనుల హక్కులను పరిరక్షించామని తెలిపారు. ‘మా తండాలో మా రాజ్యం’ అనే ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ అనేక గూడేలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని వెల్లడించారు. అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలను అందజేశామని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపామని చెప్పారు. అటవీ ఉత్పత్తులకు ‘గిరి’ బ్రాండ్‌ను ప్రోత్సహిస్తూ వాటి విక్రయాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం తోడ్పాటు అందించిందని పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యామోహంతో వృద్ధురాలి హత్య

### ఇద్దరు నిందితులు అరెస్ట్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** జూలై 17 అర్ధరాత్రి పిండిప్రోలు లో జరిగిన వృద్ధురాలి దారుణ హత్య కేసును కూసుమంచి సర్కిల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.పిండిప్రోలు గ్రామంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఐతనబోయిన ప్రశాంత్ (26) మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో తన షాప్ సమీపంలో నివాసముంటున్న వృద్ధ దంపతులను గమనించిన ప్రశాంత్, వృద్ధురాలు సుగుణ మెడలో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకోవాలని పథకం పన్నుకున్నాడు.జులై 17 అర్ధరాత్రి సుగుణ ఇంటికి వెళ్లిన ప్రశాంత్, ఆమె మెడలోని బంగారాన్ని లాక్కోవడానికి యత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో ఆమెపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఆమె మెడలోని బంగారు చైన్, నల్లపూసల చైన్‌కు చెందిన బంగారు బిళ్లలను తీసుకొని పరారయ్యాడు.హత్య అనంతరం దొంగిలించిన బంగారు చైన్‌ను ప్రశాంత్ తన వరుసకు బామ్మర్ది అయిన మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ మండలం బాలినిధర్మారం గ్రామానికి చెందిన సరగండ్ల మహేష్ (20)కి ఇచ్చాడు. మహేష్ ఆ చైన్‌ను ఖమ్మంలోని ఒక బ్యాంకులో తన పేరిట కుదువపెట్టి రూ.1,50,000 రుణం పొందినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.కేసు దర్యాప్తు అధికారి, కూసుమంచి సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు జగదీష్, సంతోష్, నాగరాజు, హరికృష్ణ, PSI దివ్యలతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సమన్వయంతో విచారణ చేపట్టాయి. ఆదివారం ఉదయం తిరుమలాయపాలెం రోడ్డులో నిందితులు ప్రశాంత్, మహేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి 9 బంగారు బిళ్లలు, 2 మొబైల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, ద్విచక్ర వాహనం, గోల్డ్ లోన్ పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసును త్వరితగతిన ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన దర్యాప్తు బృందంతో పాటు సిబ్బంది పూర్ణ చందర్ రావు, శ్రీలత, కిషన్, రాంబాబు, తొంట శ్రీనులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

## విద్యావేత్త సాంబశివరెడ్డి మృతి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రముఖ విద్యావేత్త వంగా సాంబశివరెడ్డి (80) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలో ప్రిన్సిపల్ గా, ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. వారి మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు సంతాపం ప్రకటించారు. పలువురు సాంబశివరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన ఖమ్మం విద్యారంగానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.

**పలువురి సంతాపం**

సాంబశివరెడ్డి మరణం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, రఘురాంరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సిపిఐ నేత బాగం హేమంతరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పాలకులు అనుసరిస్తున్న విధానాలతో గిరిజన హక్కులకు ప్రమాదం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలోని గిరిజనుల హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు భూక్యా వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములు, అటవీ హక్కులు, జీవనాధారం, రాజ్యాంగపరమైన రక్షణలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఖమ్మం లోని గిరిజన భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలు గిరిజనుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లోని సహజ వనరులు, ఖనిజ సంపదపై కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యత కల్పిస్తూ గిరిజనుల హక్కులను బలహీనపరిచే విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన తెగల మధ్య వైరుధ్యాలను పెంచే పరిస్థితులు దేశానికి ఆందోళనకరమని, ఈశాన్య భారత దేశంలోని మణిపూర్ వంటి పరిణామాలు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.దేశంలోని గిరిజనులకు భూమి హక్కులు, అటవీ హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు అన్ని గిరిజన సంఘాలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఖమ్మం జిల్లాలో గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న గిరిజన భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంఘాల నాయకులు అజ్మీర రామ్మూర్తి నాయక్, ధరావత్ రామ్మూర్తి నాయక్, బానోతు బస్కీ నాయక్, బానోతు వీరు నాయక్ , భూక్యా కృష్ణా నాయక్,జర్పుల భీముడు నాయక్ బానోత్ జగన్నాథం,బానోతు తారబాయి, అజ్మీరా కిషన్ మంగ్యా నాయక్, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, గిరిజనులు పాల్గొన్నారు.

## క్రషర్ అనుమతి రద్దు చేయాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలం: నారగుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న క్రషర్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ తుక్కాపురం, గౌస్ నగర్, ఎర్రంబెల్లి, నమాత్ పల్లి గ్రామాల ప్రజలు, గ్రామాల నాయకుల జేఏసీ ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఆదివారం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కన్వీనర్ పుట్ట వీరేష్ యాదవ్, కో కన్వీనర్ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ నారగుట్టపై క్రషర్ ఏర్పాటుకు అనుమతి ఇస్తే భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ కాలుష్యం, దుమ్ము, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యవసాయ భూములకు, జంతువులకు, గొర్ల కాపరులకు నష్టం కలగడంతో పాటు పశువులకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సమస్యను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు ఎల్లంల జంగయ్య యాదవ్, జేఏసీ కో కన్వీనర్ లు ఎల్లంల వెంకటేష్ యాదవ్, జనగాం సత్తయ్య, పెద్దిటి కొండల్ రెడ్డి, పాక జహంగీర్, గుండెబోయిన దానయ్య, గడ్డల నరేష్ యాదవ్, నల్లమాస రవి గౌడ్, దొమ్మాటి శ్రీశైలం మరి సోమిరెడ్డి, రత్నపురం శ్రీను, ముంతా సతీష్ యాదవ, రాసాల వెంకటేష్ యాదవ్ కాసాని వెంకటేష్,వల్లపు లింగస్వామి యాదవ్, పడమటి జంగారెడ్డి, రత్నపురం సురేందర్, సిరికొండ శ్రీకాంత్ ,గొర్ల శ్రీను,పాశం ప్రసాద్, కళ్లెం దావీద్, కళ్లెం ఏసు పాల్గొనారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 10.08.2026
www.mudranews.in | @mudranews



## తాగునీటి నాణ్యతకు

టీడీఎస్ మీటర్‌తో పరీక్షించండిఇంట్లో చిన్న టీడీఎస్ మీటర్ ఉంచుకుంటే నీటిలో కరిగి ఉన్న పదార్థాల స్థాయిని క్షణాల్లో తెలుసుకోవచ్చు. అయితే టీడీఎస్ ఒక్కటే నీరు సురక్షితమని నిర్ధారించదు.



# వివిధ రూపాల్లో అమ్మవార్లు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత వన రూపిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం చివరి ఆదివారం పురస్కరించుకొని అమ్మలగన్న అమ్మ మెదక్ జిల్లా నాగ్సానిపల్లి శ్రీ ఏడుపాయల వనదుర్గాభవాని అమ్మవారికి తెల్లవారుజామున విశేషంగా పంచామృతాలతో అభిషేకం, మహా అలంకరణ, వివిధ ఫలాలతో అలంకరణ అనంతరం కుంకుమార్చన, మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు తమ మొక్కులు, ఒడి బియ్యం సమర్పించారు. చివరి ఆదివారం కావడంతో వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు.ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి...మెదక్ పట్టణంలో గల శ్రీ కాళికాదేవి అమ్మవారు ఆషాడ మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవ నిర్వహించారు. ఆలయ అర్చకులు శివరామాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి, మహా నివేదన అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు...మెదక్ పట్టణ ప్రజల ఆరాధ్య దైవం మాత నల్ల పోచమ్మ దేవి ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, మహా అలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకుని ఒడి బియ్యం సమర్పిస్తున్నారు. ఆలయం కోలాహలంగా మారింది.








# స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో కాళికాదేవి బోనాలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. బోనాలు శ్రీ కాళికాదేవి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాడ మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శివరామాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి, మహా నివేదన అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వర్ణకారులు తమ ఇళ్ల నుండి భక్తి శ్రద్ధలతో బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని పుర వీధుల గుండా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డీజే సౌండ్, పోతరాజుల విన్యాసాలు ఆకట్టు



కున్నాయి. యువకులు నృత్యాలతో అలరించారు. ఈ ఉత్సవంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పూనా రవి చారి, పట్టణ అధ్యక్షులు ఏలేశ్వర బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల వేణు చారి, కోశాధికారి సరాపు కాశానాథం చారి, ఆలయ కమిటీ అధ్యక్షులు జగనగరి బ్రహ్మాచారి, కార్యదర్శి చిన్నోజు మహేష్ చారి, కోశాధికారి



నల్లనగుల రాజు చారి, యువజన అధ్యక్షులు ముత్తోజు రవీందర్ చారి, ప్రధాన కార్యదర్శి చిన్నోజు నరేష్ చారి, కోశాధికారి మైలవరం నవీన్ చారి, జేవల్ శ్రీనివాస్ చారి, రాచపల్లి శ్రీనివాస్ చారి, శ్రీధర్ చారి, సుంకోజు బ్రహ్మాచారి, మోత్కూరి లక్ష్మీకాంతం చారి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలి..

**రైతుల్లో కొత్త వెలుగులు నింపాలి**
**ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి**
**అమ్మవారి దయతో అన్నింట శుభం జరగాలి**
**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** వర్షాలు సమృద్ధిగా కురవాలని.. రైతుల్లో కొత్త వెలుగులు నింపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల గ్రామం లో ఆదివారం జరిగిన పోచమ్మ దేవాలయ ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ..ఆషాడ మాసం లో అమ్మవారి బోనాల కార్యక్రమం లో పాల్గొనడం సంతోషం గా ఉందన్నారు. అమ్మవారి దయతో ఈ యేటా వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి కృపతో అన్నింటా శుభం జరగాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కుల కనకయ్య, రఘురాములు, మధు, గ్రామ పెద్దలు జక్కుల సిద్దిరాములు, మెడుదుల మల్లేశం, పెంబర్తి కనకయ్య, శ్రీనివాస్, శంకరయ్య, నర్సిములు, కనకయ్య, జగన్, యాదగిరి, సత్యనారాయణ,



గ్రామ యువత, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైభవంగా బోనాల ఉత్సవాలు



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూరు పట్టణంలోని ఆదర్శనగర్ కట్టమైసమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా బోనాల వేడుకలు ఎంతో ఘనంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించబడ్డాయి.ఈ ఉత్సవాల్లో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరజ బాల్ రెడ్డి నిష్ఠతో బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ నీరజ బాల్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి హాజరై అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలం దరిపై ఉండాలని కోరుకున్నారు.ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు విఠల్ నాయక్ మరియు అధ్యక్షులు నరేష్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టమైసమ్మ బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# హిందువులంతా ఐక్యంగా ఉండాలి



**రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్ స్వామీజీ**

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** హిందూ ధర్మ పరిరక్షణ కొరకై కులమతాలకతీతంగా హిందువులందరూ ఏకతాటిపై నడవాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్ స్వామీజీ పిలుపునిచ్చారు.42 వ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమంలో భాగంగా పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ స్వామీజీ మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణ కొరకై ఎందరో త్యాగ పురుషులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహనీయులు జన్మించిన ఈభరతభూమిలోఇప్పుడు మనం జీవిస్తున్నామంటే మనం ఎంతో అదృష్టవంతులమని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల కతీతంగా, కుల మతాలక తీతంగా హిందూ సమాజం కలిసికట్టుగా ఉండాలని ఉద్దేశంతో ఎంతోమంది సాధువులం ఊరూరా సమావేశాలకు హాజరవుతున్నాం తప్ప వేరే ఉద్దేశం కాదని స్వామీజీ తెలిపారు. ఈ దేశంలో జీవిస్తున్న ప్రతి ఒక్కరూ హిందువులేనని కావున దేశం పట్ల ప్రతి ఒక్కరికి దేశం పట్లభక్తి భావం ఉండాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి పోచమ్మ ఆలయంలో వైభవంగా ఆషాఢ బోనాలు

**ముద్ర కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్టీయూ రోడ్డులోని ప్రముఖ శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ ఆలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ ఉత్సవాలకు మేడ్చల్ – మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి కృపాకటాక్షాలు ప్రజలందరిపై సదా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.సుమారు 50 సంవత్సరాల సుదీర్ఘమైన ఆధ్యాత్మిక చరిత్ర



కలిగిన ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని స్థానికులు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతీ శుక్రవారం వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. అలాగే ఏటా ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా



నిర్వహించి, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సిపిఎస్ రద్దు చేయాలి

**పిఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**సెప్టెంబర్ 1వ తేదీలోగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేయాలని పిఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ... 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకుని, నిర్ణీత గడువులోగా అమలు చేయాని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సుభాష్ రెడ్డి, నందరం రఘుబాబు, నరేందర్ రెడ్డి, రాజేందర్ లు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలోనీ ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలో "ప్రపంచ ఆదివాసి (గిరిజన) దినోత్సవాన్ని" లంబాడి హక్కుల పోరాట సమితి, గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు శ్రీను నాయక్ మాట్లాడుతూ... ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9 నాడు ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం ను జరుపుకోవాలని 1994 లో తెలిపింది. భారతదేశంలో ఆదివాసి 705 తెగలు జాతుల సమూహాలుగా ఉన్నారు, ప్రాంతాలవారీగా ఆదివాసులను వేరే వేరే పేర్లతో పిలవడం జరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో కోయ,గోండు,చెంచులు, యానాదులు,నాయక్ పోడు, కొండారెడ్డి,ఎరుకుల,సుగాలి లంబాడ మొదలగు పేర్లతో పిలుస్తారు.స్వతంత్రం వచ్చి గత 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీని గూడాలలో,తండాలలో సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి. ఆదివాసులకు రక్షణగా ఉన్న పేసా చట్టాన్ని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న జీవో నెంబర్ 3 రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మూర్తి, గిరిజన నాయకులు రఘు నాయక్, సురేష్ నాయక్, గణేష్ నాయక్, సుధాకర్ నాయక్, శ్రీకాంత్ నాయక్, వినోద్ నాయక్, ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పరామర్శ



**ముద్ర ప్రతినిధి, మెదక్:**ఏఎంసీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్, పిఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సతీష్ రావుల తండ్రి మేడి హనుమంతరావు మరణించిన విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. హన్మంత్ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. మధుసూదన్ రావు సతీష్ రావు రాధాకృష్ణరాలను పరామర్శించారు.

# వైద్య శ్రీనివాస శర్మకు కళా వాచస్పతి బిరుదు




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రముఖ వ్యాఖ్యాత, ప్రభుత్వ ఉపాధ్యాయులు వైద్య శ్రీనివాస శర్మకు కళా వాచస్పతి బిరుదు ప్రధానం చేశారు. మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సలాక రాజేశ్వరి శర్మ ఆధ్వర్యంలో ముత్తాయికోట శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన ఆషాడమాస సంబరాలలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరు రామ శర్మ చేతుల మీదుగా కళా వాచస్పతి బిరుదును వైద్య శ్రీనివాస్ శర్మ అందుకున్నారు. 20 సంవత్సరాలుగా వ్యాఖ్యాతగా పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలలో అనేకమార్లు ఉత్తమ వ్యాఖ్యాతగా పురస్కారాలు అందుకున్న శర్మకు ఈ పురస్కారం లభించడం పట్ల బ్రాహ్మణ సంఘ పెద్దలు అభినందనలు తెలిపారు.

# శంకర్ పల్లిలో ఘనంగా బోనాలు



**ముద్ర, శంకర్ పల్లి :** శంకర్ పల్లి పురపాలిక, మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలు నైవేద్యలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శంకర్ పల్లి, సింగాపురం భవానినగర్ కాలనీ లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిచి పోయాయి. చేవెళ్ల శాసనసభ్యులు యాదయ్య 15,8 10 వార్డులలో ని ఆలయాలను సందర్శించారు పురపాలిక వైస్ చైర్ పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి పోచమ్మ ఆలయంలో బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు యాదయ్యను సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఆధ్యషుడు వెంకటరెడ్డి, పురపాలిక ఆధ్యాషుడు చంద్రమౌళి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ మోహన్, జిల్లా ప్రధానకార్యదర్శి గోపాలరెడ్డి, నాయకులు ధర్మన్నగారి వెంకటరెడ్డి, యాదిరెడ్డి,పాండురంగారెడ్డి,యాదయ్య, బాలకృష్ణారెడ్డి, శేఖర్, పార్సి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555